


# విజయభాను




హైదరాబాద్, శుక్రవారం 06-10-2017 VIJAYABHANU DAILY HYDERABAD EDITION సంపుటి : 37 సంచిక : 23 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఏకకాలంలో ఎన్నికలకు సిద్ధమే

ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు

వందల కోట్ల ఖర్చు తగ్గుతుంది

ఎన్నికల కమిషనర్ ఓపీ రావత్



భోపాల్: వచ్చే ఏడాది సెప్టెంబర్ తర్వాత నుంచి ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. తరువాయి 2లో

## శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల



తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్లను శుక్రవారం తితిదే విడుదల చేయనుంది. జనవరి కోటాకు సంబంధించి ఆన్‌లైన్ కొనుగోలు, ఎలక్ట్రానిక్ లాటరీ ద్వారా కేటాయింపు టిక్కెట్లను జారీ చేయనుంది. ఆన్‌లైన్‌లో తరువాయి 2లో

# సిద్దిపేటను గోదారమ్మ ముద్దాడింది

- ఇది సీఎం కేసీఆర్ ఇచ్చిన గొప్ప వరం..
- ఇది చారిత్రాత్మక దినం.. నా జన్మ ధన్యమైంది
- భారీ నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు సంబురం





సిద్దిపేట: చరిత్రలో తొలిసారి సిద్దిపేట జిల్లాను గోదావరి జలాలు ముద్దాడాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల పథకం నుంచి గోదారమ్మ వందల కిలోమీటర్లు ప్రయాణించి మెతుకు సీమ మట్టిని తడిపింది. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం ఐనాపూర్ వద్దనున్న తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలంలోని ఏడు చెరువులకు గోదావరి జలాలు విడుదలయ్యాయి. బుధవారం ఐనాపూర్ వద్ద డీ4 కెనాల్ ద్వారా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, కలెక్టర్ వెంకట్రాంరెడ్డితో కలిసి భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగసభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఇవాళ చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి నీళ్లు అందించడంతో నా జన్మ ధన్యమైంది. ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

ఇది చారిత్రాత్మక దినం. ఈ జలాలతో చెరువులు నిండుతుంటే ఎంతో ఆనందంగా ఉన్నది. తరువాయి 2లో

## దిల్లీలో ఈసారి నిశ్శబ్ద దీపావళి..?

బాణసంచాపై మళ్లీ నిషేధం!

పిటిషన్‌ను విచారించనున్న సుప్రీంకోర్టు



దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో గతేడాది బాణసంచాపై విధించిన నిషేధాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం.. దీనిపై రేపు విచారణ చేపట్టనుంది.

పండగలు, ప్రత్యేక సందర్భాల్లో పెద్దమొత్తంలో బాణసంచా తరువాయి 2లో

## భారత్‌లో అత్యంత సంపన్నుడు ముఖేశ్ అంబానీ

వరుసగా పదోసారి ప్రకటన



దిల్లీ: భారత్‌లో అత్యంత సంపన్నుడు ఎవరో తెలుసా? ఇంకెవరు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అధిపతి ముఖేశ్ అంబానీ. 2017 సంవత్సరానికిగానూ దేశంలో 100 మంది అత్యంత సంపన్నుల వార్షిక జాబితాను ఫోర్బ్స్ ఇండియా విడుదల చేసింది. ఇందులో 38 బిలియన్ డాలర్ల సంపదతో ముఖేశ్ అంబానీ భారత్ జాబితాలో టాప్‌లో ఉన్నారు. కాగా.. వరుసగా పదో సారి ముఖేశ్ ఈ స్థానాన్ని దక్కించుకోవడం విశేషం.

గతేడాది జియోతో టెలికాం రంగంలో తరువాయి 2లో

# సార్వత్రిక పాఠశాల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



నాంపల్లి : ఈనెల 5 నుంచి 14 వరకు జరగనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-2017 సజావుగా సాగేలా ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ నిఖిల అధికారులను ఆదేశించారు. ఆమె తన ఛాంబర్‌లో విద్యా, వైద్య, ఆరోగ్య, విద్యుత్తు, జలమండలి, పోస్టల్ తదితర శాఖల అధికారులతో పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు నిఖిల తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 11 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 4,421 మంది విద్యార్థులు హాజరు కాన్నారని తెలిపారు. ఎస్.ఎస్.సి పరీక్షల నిర్వహణకు 29 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 8300 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వివరించారు. విద్యార్థులు గంట ముందుగానే తరువాయి 2లో

## రామాయణం మన ఆధ్యాత్మిక సంపద

- రాష్ట్రస్థాయి వేడుకగా వాల్మీకి జయంతి
- ఎస్టీ జాబితాలో వాల్మీకి తెగ?
- ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి: ఎస్టీల జాబితాలో వాల్మీకి తెగను చేరుస్తూ కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం వచ్చేలా గట్టిగా ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వాల్మీకి జయంతిని రాష్ట్రస్థాయి వేడుకగా నిర్వహిస్తున్నామన్న ఆయన ఇందుకు ప్రభుత్వం జీవో నెంబర్ 131ని జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రామాయణం నిత్య జీవిత పారాయణమని, మన ఆధ్యాత్మిక సంపద అని చెప్పారు. అలాంటి రామాయణ రచన చేసిన వాల్మీకి మహర్షి ధన్యజీవి అని కొనియాడారు. రామాయణం కుటుంబ వ్యవస్థ విశిష్టతను చాటి తరువాయి 2లో



## ఎలాంటి ఛాలెంజ్‌నైనా ఎదుర్కొంటాం

- చైనా, పాక్‌లతో యుద్ధానికి ఎయిర్‌ఫోర్స్ సిద్ధం
- ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా..

చైనాను సమర్థవంతంగా ఎదుర్కోగలమని, ఏకకాలంలో డ్రాగన్, పాక్‌లతో యుద్ధం చేయడానికి తాము సిద్ధమని ఇండియన్ తరువాయి 2లో




## టేకిట్ ఈజీ



మీకో శుభవార్త...
మరో కాంగ్రెస్
నేత మన పార్టీలో చేరాడు !!

## జీఎస్టీతో వ్యాపార లావాదేవీల సులభం



కరీంనగర్ : వస్తు, సేవల పన్నుతో వ్యాపారులకు 17 రకాల పరోక్ష పన్నులకు సంబంధించిన వ్యాపార లావాదేవీల నుంచి ఉపశమనం లభించిందని రాష్ట్ర పన్నుల శాఖ ఉప కమిషనర్ కె. వేణుగోపాల్ అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో డెవలప్‌మెంటు క్రెడిట్ బ్యాంకు(డీసీబీ) ఆధ్వర్యంలో జీఎస్టీ- వ్యాపారంపై ప్రభావం అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై తరువాయి 2లో

# డిసెంబరు 20న బారాబటిలో భారత్, శ్రీలంక టీ20



కటక్ : ఈ ఏడాది డిసెంబరు 20న కటక్ బారాబటి స్టేడియంలో భారత్, శ్రీలంక మధ్య టీ20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించేందుకు బీసీసీఐ షెడ్యూల్ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలోని క్రీడాభిమానుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. శ్రీలంక జట్టు భారత్ సందర్శనలో వన్డే, టెస్ట్ పోటీలతోపాటు మూడు టీ20 పోటీలు ఆడనుంది. టీ20 సిరీస్‌లో తొలిపోటీ బారాబటి స్టేడి యంలో నిర్వహించనున్నారు. ఓసీఏ కార్యనిర్వాహక అధ్యక్షుడు ధీరెన్ పలాయి అందించిన వివరాల ప్రకా రం బారాబటిలో అంతర్జాతీయ స్థాయి టీ20 క్రికెట్ పోటీ జరగడం ఇది రెండోసారి అవుతుంది. కొంతకాలం క్రితం భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య టీ20 పోటీ జరిగింది. డిసెంబరులోగా ఒడిశా క్రికెట్ సంఘం కార్యవర్గ ఎన్నికలు పూర్తికానున్నాయి. కొత్త కార్యవర్గం నేతృత్వంలో పోటీ జరగనుందని తెలిపారు.

## ఈనెల 8 నుంచి
## రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు

కొరాపుట్ : కొరాపుట్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 12 వరకు రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. పోటీల నిర్వహణకు కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించింది. జాతీయ అంధుల క్రికెట్ శిక్షకుడు చంద్రశేఖర్‌పట్నాయక్ ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటైంది. స్థానిక 3వ బెటాలియన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాలలో పోటీలు నిర్వహించనున్నారు. మొత్తం 12 జట్లు పాల్గొంటాయి. ఈ పోటీలకు ఒడిశా క్రికెట్ జట్టు ఎంపిక కమిటీ హాజరు కానుందని పట్నాయక్ తెలిపారు. ఈ పోటీలలో క్రీడాకారుల ప్రదర్శన ఆధారంగా జట్టు ఎంపిక చేస్తారని చెప్పారు. క్రీడాకారులు వసతి, శిక్షణ శిబిరాలు, సాధన చేసే మైదానాలు, వాటిలో ఏర్పాట్లపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో సాయికుమార్, ఇక్బాల్‌హుస్సేన్, భవానీశంకరమిశ్ర తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో విజేతలుగా నిలవాలి

సింధనూరు : గెలుపోటముల మధ్య కేవలం రెప్పపాటు వ్యత్యాసమే ఉంటుంది. విజేత కావాలంటే ఆ వ్యవధిని అధిగమించాల్సి ఉంటుంది. ఏ రంగంలోనైనా విజేతగా నిలిచేందుకు కృషి చేయాలని జడ్పీ సభ్యుడు బసవరాజ్‌హిరేగౌడ విద్యార్థులకు హితవు పలికారు. జిల్లా విద్యాశాఖ, ఎస్.కె.ఇ. విద్యా సంస్థల ఆధ్వర్యంలో ప్రాథమిక, ప్రౌఢశాల విద్యార్థుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు శ్రీకృష్ణదేవరాయ విద్యా సంస్థ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని ప్రారంభించిన బసవరాజ్ మాట్లా డుతూ ఉత్తర కర్ణాటక ప్రాంతం ఎందులోనూ వెనుకబడ లేదన్నారు. విద్య, క్రీడలు, వ్యవ సాయం, ఆర్థిక రంగం ఇలా అన్నిట్లో ముందున్న మనం ఇకపై వెనుకబడిన వాళ్లం అనే భావన వదిలేయాలని చెప్పారు. ఇటీవల తన భార్యతో కలిసి హిమాలయ పర్వత శిఖరాన్ని 17500 అడుగుల వరకూ అధిరోహించి గుర్తింపు సాధించిన స్థానిక వైద్యుడు సుధాన్‌రాయ్ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

అనంతరం సుధాన్‌రాయ్ దంపతులను నిర్వా హకులు సన్మానించారు. ఎస్‌కేఈ సంస్థల నిర్దేశకుడు బలుసు సుబ్ర హ్మణ్యం, బండ్లమూడి వెంకట్రావు, డా.సుధీర్, జి.సత్యనారాయణ, బొజ్జయ్య, సింహాద్రి సత్యనారాయణ, పాలనాధికారి నరేంద్రనాథ్, సళ్లి జీపీ అధ్యక్షురాలు జ్యోతినాయుడు తదితరులు వేదికపై ఆశీనులయ్యారు.

## కొనసాగుతున్న అండర్-11
## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



కటక్ : రెవెన్షా విశ్వవిద్యాలయం, ఎస్ఆర్ చదరంగం కేంద్రం సంయుక్తంగా ఏర్పాటు చేసిన అండర్-11 రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. పోటీలలో బాలుర విభాగంలో మనీష్ కుమార్, శాస్వత మల్లిక్‌లు ముందంజలో నిలిచారు. బాలికల విభాగంలో శృతి స్నేహ, విజయలక్ష్మి బారిక్, పి.సాయి రూప ముందంజలో ఉన్నారు.

ఫైనల్ పోటీలు జరగనున్నాయి. రెవెన్షా వర్శిటీ సెవెన్ పిల్లర్ హాల్‌లో పోటీలు కొనసాగుతున్నాయి.

## హంపీ ఉత్సవాలకు
## ఛాయాచిత్ర పోటీలు

బళ్లారి : హంపీ ఉత్సవానికి ఛాయాచిత్ర పోటీలు నిర్వహిస్తున్నాం. ఆసక్తి గల ఛాయాగ్రాహకులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలి. వారు జిల్లా నగరాభివృద్ధి సహాయక కార్యపాలక ఇంజినీర్ స్థిరవాణికి ఫోన్ చేసి ఈ నెల 28 లోపల పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఛాయగ్రాహకులు వన్యజీవి, హంపీ ప్రకృతి, హంపీ చరిత్ర, సాంస్కృతిక చిత్రాలను ప్రదర్శనలో ఉంచాలని సూచించారు. ఈ నెల 28 లోపల చిత్రాల నకలును అధికారికి సమర్పించాలన్నారు. తీసిన చిత్రాలకు డిజిటల్ మిక్సింగ్, గ్రాఫిక్, డిజిటల్ ఎఫెక్ట్ వంటివి చేయకూడదు. ప్రకృతి సిద్ధంగా తీసిన చిత్రాలను మాత్రమే ప్రదర్శనలో ఉంచాలి. ప్రథమ స్థానంలో నిలిచిన ఛాయా గ్రాహకుడికి రూ.25 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.15 వేలు, రూ.10 వేల నగదు బహుమతి, ప్రమాణపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

## మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి

రాయచూరు : బహిరూమే రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు కట్టించాలన్న ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేందుకు పంచాయతీ అభివృద్ధి, నోడల్ అధికారులు నిబద్ధతతో శ్రమించాలని జడ్పీ సీఈవో అభిరామ్ శంకర్ సూచించారు. జడ్పీ సభాంగణంలో స్వచ్ఛభారత్ మిషన్ నోడల్ అధికారులకు సదస్సు జరిగింది. ఇందులో పాల్గొన్న సీఈవో మాట్లాడుతూ గాంధీ గ్రామ ప్రశస్తులు అందుకున్న ఐదు పంచాయతీలు ఈనెల 10 లోపు నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి తాలూకాకు జిల్లా పరిషత్ ఎంపిక చేసిన నాలుగు పంచాయతీల్లో నవంబరు చివరి లోపు నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించాలని సూచించారు. కొన్ని పంచాయతీల్లో నిర్మాణాలకు సంబంధించి సకాలంలో సొమ్ము ఇవ్వడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయన్నారు. సరైన సమయంలో సొమ్ము ఇస్తే ప్రజల్లో నమ్మకం కల్గుతుందని చెప్పారు. మరుగుదొడ్లు నిర్మించే ముందు క్షేత్ర స్థాయిలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరారు. ప్రతి అంగన్‌వాడీ పరిధిలో గర్భిణులు, బాలింతలు ఉంటారని ఆయా ప్రాంతాల్లో నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మహిళలకు పోషకా హారంతో పాటు మరుగుదొడ్డి కూడా అవసర మన్న విషయంపై అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ విజయవంతానికి ప్రజా ప్రతినిధులు సహకారం ఇస్తామని హామీ ఇచ్చినందున వారి సేవలను వినియోగించుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో మరుగుదొడ్ల అభియాన్ చేపడుతున్నట్లు సీఈవో తెలిపారు. తాలూకా స్థాయిలో స్వఛభారత్ మిషన్ అమలును సమీక్షిస్తామని తెలిపారు. జడ్పీ ఉప కార్యదర్శి యూసఫ్ పాల్గొన్నారు.

## 8న దీపోత్సవం

కోలారు : శిథిలావస్థలో ఉన్న పుష్కరిణుల పునరుజ్జీవనానికి శ్రమిస్తున్న యువ బ్రిగేడ్ సభ్యులు ఈనెల 8న దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ ఏడాది జూన్, జులై నెలల్లో కొడియనూరు కోనేటికి జీవం పోశారు. ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్న నేపథ్యంలో దీపోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించారు.

## చెత్త బుట్టలను వినియోగించండి



బ్రహ్మపుర :బీఎమ్సీలోని అన్ని వార్డుల్లోని ఇళ్లకు చెత్త తొట్టెలు పంపిణీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా స్థానిక 24వ వార్డులో నగర శాసనసభ్యుడు రమేష్‌చంద్ర చ్యవుపట్నాయక్ పలు ఇళ్లల్లో మహిళలకు నీలం, పచ్చ రంగు చెత్త తొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చ్యవు పట్నాయక్ వార్డు ప్రజలతో మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచే దిశగా బీఎమ్సీ కృషి చేస్తోందన్నారు. నగరవాసులు కూడా చెత్తలను రోడ్లపై వేయకుండా ఇళ్లలో ఉన్న పొడి, తడి చెత్తను ఈ తొట్టెల్లో వేసి ఉదయం వార్డుల్లోకి వస్తున్న చెత్తను సేకరించే వాహనం తొట్టెల్లో వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ వార్డు కార్పొరేటర్ సంఘమిత్ర దొళాయి, బీడీఏ అధ్యక్షుడు సుభాష్ మహరణ, భీమ దొళాయి తదితరులు పాల్గొన్నారు.

## భాజపాకు క్రైస్తవులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి

బెంగళూరు : రానున్న విధానసభ ఎన్నికల్లో క్రైస్తవులు భాజపాకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బిషప్ డాక్టర్ ఎం.ఫ్రాన్సిస్ జాక్సన్ కోరారు. ఇక్కడ జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వచ్చి తీరాలన్నారు. అందుకు క్రైస్తవులు పూర్తి స్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 55ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ క్రైస్తవుల విశ్వాసం పొందడంలో సంపూర్ణంగా విఫలమైందని ఆరోపించారు.

యడ్యూరప్ప ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రార్థన మందిరాల నిర్మా ణాలకు రూ.50కోట్లు విడుదల చేశారని, సదా నందగౌడ హయాంలో రూ.75కోట్లు విడుదల చేశారని గుర్తు చేశారు.

## 13 భాషల్లో చందన గంధం

బెంగళూరు : పరభాషా సినిమాల ధాటికి చందనసీమ అల్లాడుతోందనే ఆరోపణల్లో నిజం లేదని నిరూపించేందుకు కటక సినిమా ట్రైలర్ ఏకంగా 13 భాషల్లో విడుదలైంది. ఇటీవల నగరంలో ఏర్పాటైన కార్యక్రమంలో పవర్‌స్టార్ పునీత్‌రాజ్‌కుమార్ దీన్ని విడుదల చేశారు. కన్నడతో పాటు తుళు, మరాఠి, హిందీ, ఇంగ్లిషు, కొడవ, కొంకిణి, బ్యారి, అస్సామీ, తెలుగు, తమిళం, మల యాళం, పంజాబీ భాషల్లో విడుదలైంది.

సినిమా కూడా బాగా వచ్చిందని యూనిట్ సభ్యులు తెలిపారు. సంగీత దర్శకుడుగా పేరొందిన రవిబస్రూర్ ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం కానున్నాడు.

## నవంబరు 4 నుంచి చారిత్రక బాలి జాతర

కటక్ : ఈ ఏడాది నవంబరు 4వ తేదీ నుంచి 11 వరకు కటక్‌లో చారిత్రక బాలిజాతర నిర్వహిస్తామని కటక్ కలెక్టర్ సుశాంత మహాపాత్ర్ తెలిపారు. కలెక్టర్, సీఎంసీ అధికారులు, తహసీల్దార్ సంజివితా రాయ్ తదితరులు బాలిజాతర జరిగే మైదానాన్ని సందర్శించారు.

# బిజద పాదయాత్రల్లో వార్డు కమిటీల ఏర్పాటు



బరగఢ్ : బరగఢ్ జిల్లాలో బిజద పార్టీ తరపున నూతన వార్డు కమిటీల ఏర్పాటు చేశారు. బరగఢ్ సమితి దాంగేర్ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమానికి బిజద నేత శిభత్స చత్తర్ అధ్యక్షత వహించారు. పర్యవేక్షకుడు శీధర్ సాహు ముఖ్య అతిథిగా విచ్చేశారు. నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. వార్డు స్థాయిలో బిజద బలోపేతం కావాలని ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కొరాపుట్: గ్రామాలలో బిజద నాయకులు, కార్యకర్తల పాదయాత్రలు, శిబిరాలు జోరుగా సాగుతున్నాయి. గ్రామీణస్థాయి నుంచి ప్రజల్లోకి వెళ్లాలనే ఉద్దేశం, ప్రణాళికలో భాగంగా విరివిగా పాదయాత్రలు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తూ గ్రామాల మద్దతు కూడగట్టే ప్రయత్నం సాగిస్తున్నారు. పాదయాత్రలతో పాటు శిబిరాలు, పాదయాత్ర ఉద్దేశాన్ని వివరిస్తున్నారు.

పోలింగు కేంద్రాల స్థాయి ముగియడంతో గ్రామాలలో పాదయాత్ర ఇదంతా ప్రజల మద్దతు కూడగట్టుకునేందుకు 2019 ఎన్నికల తయారీగా పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఎంజీ జిన్నూహిక్కాక, రాష్ట్రీయ బిజద కార్యదర్శి ఈశ్వర చంద్ర పాణిగ్రహి తదితరులు పాల్గొనడంతో కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## ఏకకాలంలో ఎన్నికలకు సిద్ధమే

దీంతో రూ. వందల కోట్ల ఖర్చు తగ్గుతుందని ఎన్నికల కమిషనర్ ఓపీ రావత్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌వో) నెట్‌వర్క్ వెబ్ యాప్‌ను రావత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జమిలీ ఎన్నికల గురించి మాట్లాడారు.

దీనికి సంబంధించి ఎన్నికల సంఘానికి ఏం కావాలో మేం ప్రభుత్వానికి వివరించాం. ఈవీఎంలు తదితర అంశాల గురించి చర్చించాం. అంతేగాక ఇందుకు ఎంత డబ్బు అవసరమో కూడా చెప్పాం. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలంటే 40లక్షల ఎన్నికల సంబంధిత పరికరాలు కావాలి. వీవీపాట్ (వోటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్)ల కోసం రూ.3,400కోట్లు, ఈవీఎంల కోసం రూ.12వేల కోట్లు ఖర్చు అవుతుంది. అని రావత్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇందుకు సంబంధించి నిధులు అందించడంతో అదనపు పరికరాల కోసం ఆర్డర్లు కూడా ఇచ్చినట్లు రావత్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 2018 నాటికి అన్ని పరికరాలు అందుబాటులోకి వస్తాయని, అప్పుడు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు తాము సన్నద్ధంగా ఉంటామని తెలిపారు.

ఏకకాలంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రతిపాదన తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గతేడాది నవంబర్‌లో ప్రధాని మోదీ ఈ ప్రతిపాదన చేశారు. దీనివల్ల కోట్లాది రూపాయలు ఆదా అవడమేగాక, ఎంతో సమయం కలిసివస్తుందని ఆయన అన్నారు.

## శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

కల్యాణోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ, ఆర్జిత బ్రహ్మోత్సవం టిక్కెట్ల కొనుగోలు అవకాశం ఉంటుంది. ఎలక్ట్రానిక్ లాటరీ కింద సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన, నిజపాద దర్శనం టిక్కెట్లను జారీ చేస్తుంది. వీటి కోసం వారం రోజుల పాటు నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తుంది. అనంతరం లాటరీ ద్వారా భక్తులను ఎంపిక చేసి టిక్కెట్లను కేటాయిస్తుంది. టిక్కెట్లకు నగదును ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

తిరుమలలో భారీ వర్షం

తిరుమలలో బుధవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి శ్రీవారి ఆలయంలో మోకాలి లోతు వర్షపునీరు చేరింది. అగ్నిమాపక యంత్రాన్ని తీసుకొచ్చి నీటిని తోడారు. రెండు గంటల పాటు యాత్రికులు ఎటూ కదల్లేని పరిస్థితి. తిరువీధులు, శ్రీవారి ఆలయం ఎదుట ఎన్నడూ లేని విధంగా నీటి మట్టం పెరిగిపోయింది. తిరుమలతో పాటు కనుమ రహదారుల్లో వాహనాల రాకపోకలు కొంత సమయం స్తంభించాయి. ఏడో మైలు నుంచి ప్రవహించిన వాన నీరు మాల్వాడిగుండం.. కపిలతీర్థం పైభాగం నుంచి పెద్ద శబ్దంతో ప్రవహించింది.

## దిల్లీలో ఈసారి నిశ్శబ్ద దీపావళి..?

ఉపయోగిస్తుండటంతో తీవ్ర వాయు కాలుష్యం ఏర్పడుతోంది. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొంటూ గతేడాది నవంబర్‌లో దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బాణసంచాపై నిషేధం విధించింది సుప్రీంకోర్టు. బాణసంచాలను విక్రయించే టోకు, చిల్లర వ్యాపారుల లైసెన్సులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే దీనిపై భిన్నాభిప్రాయలు వ్యక్తమవడంతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది. కాలుష్యం దృష్ట్యా బాణసంచా విక్రయ లైసెన్సులను సగానికి తగ్గించేలా చూడాలని పోలీసులను ఆదేశించింది.

తాజాగా ఈ నిషేధాన్ని తిరిగి కొనసాగించాలని కోరుతూ అర్జున్ గోపాల్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన పిటిషన్‌ను న్యాయస్థానం స్వీకరించింది. శుక్రవారం దీనిపై విచారణ చేపట్టనున్నట్లు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అశోక్ భూషణ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

## భారత్‌లో అత్యంత సంపన్నుడు ముఖేశ్ అంబానీ

సంచలనం సృష్టించిన ముఖేశ్ అంబానీ ఈ ఏడాది ఆయన సంపదను మరో 15.3 బిలియన్ డాలర్లు పెంచుకున్నారు. అంతేగాక ఆసియాలో మొదటి ఐదుగురు అత్యంత సంపన్నుల్లో ముఖేశ్ అంబానీ కూడా ఉన్నారు. ఇక వరుసగా పదోసారి దేశంలో అత్యంత ధనికుడిగా స్థానం సంపాదించారు. ఇక ఈ జాబితాలో టెక్ మొఘల్, విప్రో ఛైర్మన్ అజిమ్ ప్రేమ్‌జీ రెండోస్థానంలో ఉన్నారు. ఆయన సంపద 19 బిలియన్ డాలర్లు.

ఫోర్బ్స్ ఇండియా టాప్ 10 సంపన్నులు వీరే..

1. ముఖేశ్ అంబానీ(38 బిలియన్ డాలర్లు)
2. అజిమ్ ప్రేమ్‌జీ(19 బిలియన్ డాలర్లు)
3. హిందుజా బ్రదర్స్(18.4 బిలియన్ డాలర్లు)
4. లక్ష్మీ మిత్తల్(16.5 బిలియన్ డాలర్లు)
5. పల్లోంజి మిస్త్రీ(16 బిలియన్ డాలర్లు)
6. గోద్రేజ్ ఫ్యామిలీ(14.2 బిలియన్ డాలర్లు)
7. శివ నాడార్(13.6 బిలియన్ డాలర్లు)
8. కుమార బిర్లా(12.6 బిలియన్ డాలర్లు)
9. దిలిప్ సంఘ్వీ(12.1 బిలియన్ డాలర్లు)
10. గౌతమ్ అదానీ(11 బిలియన్ డాలర్లు)

## రామాయణం మన ఆధ్యాత్మిక సంపద

చెబుతుందని., ప్రభుత్వ పరిపాలన కోసం రామాయణంలో విలువైన సూచనలున్నాయని తెలిపారు. ఆదిమ గిరిజన తెగ అయిన వాల్మీకి సామాజిక వర్గాన్ని గిరిజన తెగల జాబితాలో చేర్చడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వస్తున్నా మీకోసం పాదయాత్ర సందర్భంగా వాల్మీకుల కష్టాలు ప్రత్యక్షంగా చూశానన్న చెప్పారు. యాభై ఏళ్లుగా ఎటువంటి సముద్ధరణకు నోచుకోని వాల్మీకుల పరిస్థితి తనను కలచివేసిందని చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక అమలుచేసేందుకు కార్యాచరణకు ఉపక్రమించామని.. శాసన సభ సమావేశంలో గవర్నర్ ప్రసంగంలోనే ఈ అంశాన్ని చేర్చి తమ నిబద్ధత చాటుకున్నామన్నారు. వాల్మీకుల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయడానికి నియమించిన సత్యపాల్ కమిటీ సిఫారసులను కేంద్రానికి నివేదిస్తామని వెల్లడించారు.

## ఎలాంటి ఛాలెంజ్‌నైనా ఎదుర్కొంటాం

ఎయిర్‌ఫోర్స్ చీఫ్ బీఎస్ ధనోహ తెలిపారు. ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా గురువారం మీడియాతో మాట్లాడిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎలాంటి ఛాలెంజ్‌నైనా ఎదుర్కోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. సర్జికల్ స్ట్రయిక్స్‌లో వైమానిక దళం పాల్గొనాలనే విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆయన తెలిపారు. సరిహద్దుల వెంబడి లక్ష్యాలను గుర్తించగల, వాటిని తాకగల సామర్థ్యం భారత వైమానిక దళానికి ఉందని ధనోహ తెలిపారు.

చైనా, పాకిస్థాన్‌లతో ఏక కాలంలో యుద్ధం చేయాల్సి వచ్చిన మేం సిద్ధమేనని ఎయిర్ చీఫ్ మార్షల్ వెల్లడించారు. గత నెలలో ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ మాట్లాడుతూ.. చైనా, పాక్‌లతో యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుండటం, చైనా బలగాలు ఇప్పటికీ టిబెట్‌లోని చుంబీ లోయలోనే ఉన్న నేపథ్యంలో ఎయిర్ ఫోర్స్ చీఫ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## సిద్దిపేటను గోదారమ్మ ముద్దాడింది

ఇది సీఎం కేసీఆర్ ఇచ్చిన గొప్ప వరంఅని సంబురపడ్డారు. తపాస్‌పల్లి కుడి, ఎడమ కాల్వల నుంచి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని 14 గ్రామాలు, సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు మండలాలతో పాటు కొండపాక మండలంలోని మొత్తం 73 గ్రామాలకు గోదావరి జలాలు అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గంగారం నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ 187 కిలోమీటర్ల దూరం ఉన్నదని తెలిపారు.

## సార్వత్రిక పాఠశాల పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి జి.రమేష్, అదనపు డీసీపీ రవికుమార్, ఆర్బియస్ కో-ఆర్డినేటర్ లీల, టీఎస్‌పీడీఎల్ ప్రతినిది ఎ.డి.ఇ. యాదగిరి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి జయప్రద, పోస్టల్ శాఖ ప్రతినిధి వినోద్‌కుమార్‌రెడ్డి, ఆర్టీసీ డి.డి.ఎం సుధా పరిమళ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీతో వ్యాపార లావాదేవీల సులభం

మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలు కావడంతో వ్యాపారాల్లో ఆర్థికలావాదేవీల నిర్వహణ సులభతరం అయిందన్నారు. అంతేకాకుండా భవిష్యత్తులో నిత్యావసరాల ధరలు తగ్గి వినియోగదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రధానంగా సగటు జీవి వినియోగించే 80 శాతం నిత్యవసరాల ధరలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. జీఎస్టీపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాపారులు, ప్రజలు ఈ ఏకీకృత పన్ను విధానంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, దీంతో భవిష్యత్తులో మరిన్ని ప్రయోజనాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పన్నులశాఖ ఉప కమిషనర్ సుబ్బారావు, ఛార్టెర్డ్ అకౌంటెంట్ ఎం.సంతోష్ రెడ్డి, డీసీబీ బ్యాంక్ మేనేజర్ ఆడేపు నరేందర్, బ్యాంకు ప్రతినిధి శంకర్ పాండా, వ్యాపారస్థులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్ : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల కోసం శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌లను ఆర్డీఓ శ్యామలాదేవి, రీజినల్ లేబర్ కమిషనర్(సెంట్రల్) ఎస్‌కే మిశ్రా సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి సూచలనలు చేశారు. సీసీసీలోని ఎస్‌సీఓఏ క్లబ్‌లో ఓట్ల లెక్కింపు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. లెక్కింపు సమయంలో బందోబస్తు, సిబ్బందికి కల్పించాల్సిన సదుపాయాలపై ఆరా తీశారు. బ్యాలెట్ బాక్సులు, ఓటింగ్ సంబంధించిన సమాగ్లను గనులు, విభాగాలకు సకాలంలో చేర్చి పోలింగ్ ప్రారంభమయ్యే సమయానికి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పోలింగ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కల్పిస్తున్న భోజన వసతిలో ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇన్చార్జి జీఎం పీవీ సత్యనారాయణ, డీవైజీఎం(పీ) చిత్తరంజన్‌కుమార్, పర్సనల్ మేనేజర్ జీవీ కిరణ్‌కుమార్, డివైపీఎంలు తుకారాం, అనిల్‌కుమార్, కాంతారావు, సెక్యూరిటీ అధికారి షఫీ, సీఐలు నారాయణ నాయక్, ప్రమోద్‌రావు, సీసీసీ ఎస్సై దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల శ్రేయస్సుకు కృషి



పాపన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల శ్రేయస్సుకు కృషి చేస్తోందని ఉపసభాపతి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఏడుపాయల దేవాలయ ఆవరణలోని గోకుల్ షెడ్‌లో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం మెదక్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉపసభాపతి మాట్లాడు తూ తెలంగాణ ఉద్యమంలో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘంవారు ఎంతో కష్టపడ్డారన్నారు. భవిష్యత్తు లో సంఘం భవనాలను కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం మెదక్ జిల్లా అధ్యక్షురాలు తిరునగరి గోదావరి సంఘం అవసరాలను పద్మాదేవేందర్‌రెడ్డికి విన్నవించారు. మెదక్‌లో సంఘం భవన నిర్మాణం, వృద్ధాశ్రమం, గోశాల, శ్రీకృష్ణ దేవాలయం కట్టించాలని కోరారు. అలాగే వైష్ణవ దేవాలయాల్లో ఉన్న చాత్తాద శ్రీ వైష్ణవ అర్చకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మహిళలకు ప్రిటింగ్, పెయింటింగ్, కుట్లు అల్లికలు, బ్యూటీషియన్ శిక్షణ ఇప్పించాలన్నారు. యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. తూప్రాన్, నాచవరం, నర్సాపూర్, రామాయంపేట, పాపన్నపేటలో సంఘం భవన నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం పద్మాదేవేందర్‌రెడ్డి గోపురంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయం ముందు ప్రవహిస్తున్న మంజీరా నదిలో గంగమ్మకు పూజలు చేపట్టారు. ఎంబీసీ ఛైర్మన్ తాడూరి శ్రీనివాస్, సంఘం జాతీయ అధ్యక్షులు రామానుజం, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందం శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

## తపాసుపల్లి నీటి తరలింపుపై అఖిలపక్షాల ఆందోళన

చేర్యాల : కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులోని తపాసుపల్లి రిజర్వాయరు నుంచి గోదావరి జలాలను కొండపాకకు తరలించడాన్ని నిరసిస్తూ చేర్యాలలో అఖిలపక్ష నాయకులు ఆందోళన చేశారు. స్థానిక పాత బస్టాండు వద్ద రాష్ట్ర రహదారిపై రాస్తారోకోకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, బచ్చన్నపేట మండలాల్లోని చెరువులను నింపిన తర్వాత మాత్రమే తరలించాలని నినదించారు. ఆందోళనలో ఆయా పార్టీల నాయకులు ముస్త్యాల కిష్టయ్య, కొంగరి వెంకట్‌మావో, ముస్త్యాల గణేశ్, కొమ్ము రవి, అందె అశోక్, మిట్టపల్లి నారాయణరెడ్డి, ఆడెపు చంద్రయ్య, బుట్టి బిక్షపతి, మల్లిగారి సూరయ్య, జి.బాలనర్సయ్య, నవజీవన్ తదితరులు పాల్గొన్నారు.

## చివరి ఆయకట్టు వరకు సాగు నీరందిస్తాం

జైనథ్: రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరందిస్తామని రాష్ట్ర మంత్రి జోగు రామన్న అన్నారు. జైనథ్ మండలం గిమ్మ పంచాయతీలోని హత్తిఘాట్ వద్ద కొనసాగు తున్న పంపుహౌజ్, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను నాయకులతో కలిసి పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు బహిరంగ సభలో ఇచ్చిన మాట ప్రకారం పెన్‌గంగపై బ్యారేజీ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. 50 ఏళ్ల ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతుందన్నారు. కోర్ట-చనాఖా బ్యారేజీ, విద్యుత్తు సబ్‌స్టేషన్, పంపుహౌజ్ నిర్మాణ పనులు చకచకా కొనసాగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది వరకు పనులు పూర్తిచేసి 51 వేల ఎకరాలకు సాగు నీరందిస్తామన్నారు. జిల్లా ప్రజలకు సందేహాలు లేవని, ప్రతిపక్ష పార్టీల నాయకులకు సందేహాలు కలగడం శోచనీయమన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరం దించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

పనుల పురోగతిపై నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షించారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట పెన్‌గంగ ఈఈ రమణారెడ్డి, డీఈ మనోహర్, ఆలయ కమిటీ ఛైర్మన్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ ఎన్.లింగారెడ్డి, ఐటీడీఏ డైరెక్టర్ పెందూర్ దేవన్న, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తల్లెల చంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మద్దుల పూషన్న, నాయకులు తోట రమేష్, కోల భోజన్న, పట్టెపు విలాస్, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆర్మీ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోండి

శాంతినగర్ : జిల్లాలోని నిరుద్యోగ యువకులు ఆర్మీలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. జోనల్ రిక్రూట్ కార్యాలయం చెన్నై వారి ఆధ్వర్యంలో నవంబర్ 1 నుంచి 10వతేదీ వరకు కరీంనగర్‌లోని డా.బి.ఆర్.అంబేడ్కర్ స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందన్నారు. సోల్జర్ జనరల్ డ్యూటీ, సోల్జర్ క్లర్కు, స్టోర్‌కీపర్ టెక్నికల్, సోల్జర్ ట్రేడ్‌మెన్ కేటగిరీల్లో నియామకాలు ఉంటాయన్నారు. అభ్యర్థుల వయోపరిమితి, ఇతత్రతా శారీరక, విద్యా అర్హతల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. జాయిన్ ఇండియన్ ఆర్మీ.ఎన్ఐసీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు. సూచించిన వివరాలతో 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు జిల్లాకేంద్రంలోని సైనిక సంక్షేమ కార్యాలయంలో సంప్రందించవచ్చన్నారు. వివరాల కోసం 08732-227063ను సంప్రదించాలని సూచించారు.

## ప్రమాదంపై కేసు నమోదు

బూర్గంపాడు : బూర్గంపాడు-అశ్వాపురం మండలాల సరిహద్దు అటవీప్రాంతంలో గత నెల 29వ తేదీ సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటనపై బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటాపురం కాలనీకి చెందిన షేక్ హుస్సేన్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాలును కోల్పోయారు. ఆయన చంద్రుగొండలో నివసిస్తున్న తన బంధువుల ఇంటికి వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. వాహనంపై బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ సరిహద్దు దాటుతుండగా, ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. కారు హుస్సేన్ కుడికాలు పైనుంచి వెళ్లగా, హైదరాబాదులో మెరుగైన చికిత్స కోసం తీసుకెళ్లారు. వైద్యులు కాలును తొలగించారు. ఈ ప్రమాదం జరిగిన తర్వాత డ్రైవర్ కారును ఆపకుండా వెళ్లిపోతుండగా స్థానికులు నెంబరును గుర్తించి బాధితుని కుటుంబికులకు తెలిపారు. బుధవారం హుస్సేన్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో బూర్గంపాడు ఎస్సై జి.ఉదయ్‌కిరణ్ కేసు దర్యాప్తు చేపట్టారు.

## దుప్పిని వేటాడిన కేసులో ఆరుగురి అరెస్ట్



వేమనపల్లి : వేమనపల్లి దస్నాపూర్ గ్రామ శివారులో రెండు రోజుల కిందట దుప్పిని వేటాడి హతమార్చిన ఆరుగురు నిందితులను అరెస్ట్‌చేసి రిమాండుకు పంపినట్టు డివిజనల్ అటవీ శాఖ అధికారి తిరుమలరావు, కుశ్నెపెల్లి అటవీ రేంజ్ అధికారి అప్సల కొండ తెలిపారు. నీల్వాయి గ్రామానికి చెందిన మల్లేష్ (25) చిన్నన్న( 35) తాటిపాముల వెంకాగౌడ్ (28) గంగాగౌడ్ (40) బోరెం రాజన్న (29) చిడెం బానయ్య అనే వ్యక్తులు ముఠాగా ఏర్పడి దుప్పిని రాత్రి వేళల్లో హతమార్చి మాంసాన్ని విక్రయించినట్టు తేలిందన్నారు. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని చెన్నూరు మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చినట్టు పేర్కొన్నారు. వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## జూరాల నుంచి 54 వేల క్యూసెక్కుల విడుదల

ధరూర్ : జూరాల జలాశయానికి వస్తున్న వరద నీటి ప్రవాహం తగ్గుతోంది. బుధవారం నాటికి జలాశయానికి 61వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి 12వేల క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా మరో 42వేల క్యూసెక్కుల నీటిని జల విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు వదులుతున్నారు. మొత్తం 54వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి జలాశయంలోకి వరద స్వల్పంగా పెరిగింది. జలాశయంలోకి 35వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. జలాశయంలో గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వ ఉండటంతో వచ్చిన వరద నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 41వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి 39వేల క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. ఎగువ జూరాలలో 6, దిగువ జూరాలలో 6 చొప్పున మొత్తం 12 యూనిట్లలో 468 మెగావాట్ల విద్యుదుత్పత్తి అవుతున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

## జిల్లావ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు: డీపీవో



కూసుమంచి : జిల్లాలో పారిశుద్ధ్యాన్ని కాపాడే క్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పారిశుధ్యం(ఫ్రైడే-డ్రైడే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరెడ్డి చెప్పారు. జిల్లా మలేరియా నివారణాధికారి రాంబాబుతో కలిసి కూసుమంచి వచ్చిన జిల్లా పంచాయతీ అధికారి కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పంచాయతీ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితోపాటు అన్ని ప్రభుత్వశాఖల ఉద్యోగులు, గ్రామసమన్వయ కర్తలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లతో సహా అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అవసరమైతే పాఠశాలల్లో 8, 9తరగతులు చదివే విద్యార్థులు సైతం స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొంటారని వవరించారు. ఈ ఏడాది మే నెల నుంచి ఇలాంటి చర్యలు తీసుకోవడం మూలంగా జిల్లాలో జ్వరాలు, అనారోగ్య పరిస్థితులు అదుపులో ఉన్నాయన్నారు.

పంచాయతీ ఆధ్వర్యంలో మురుగు కాలువల శుభ్రత, గేట వాల్వ్‌ల లీకేజీ, పైప్‌లైన్ల లీకేజీ నివారణ తదితర పారిశుధ్యం కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు.

వైద్య, ఇతర శాఖల సిబ్బంది అన్ని గ్రామాల్లోని అన్ని నివాసాలకు వెళ్లి నీటినిల్వతో అనర్థాలను, దోమల వ్యాప్తి నివారణ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. నిల్వ ఉన్న నీటిని తొలగిస్తారన్నారు. విలేకరుల సమావేశం లో సర్పంచి బారి వెంకటమ్మ, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, వైద్యారోగ్య శాఖ సూపర్‌వైజర్ వీరస్వామి పాల్గొన్నారు.

## సిద్దిపేటలో సంబురంగా అలయ్ బలయ్

సిద్దిపేట : కొన్ని దుష్టశక్తులు హిందువుల మధ్య తగదాలు సృష్టించేందుకు యత్నిస్తున్నాయని భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలోని తాడూరి బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో ఆయన అలయ్ బలయ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువుల్లో అన్ని కులాల వారు ఒకటే అన్న భావన తీసుకువచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. సిద్దిపేట ప్రజలంతా ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తారని తర్వాత అంతా కలిసిపోతారని అన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరుపుకోవాలని అకాక్షించారు. ఈ పోత రాజుల విన్యాసాలు, మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ నటుల హాస్యం, శాస్త్రీయ నృత్యాలు, ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రతినిధులు రామచంద్రారెడ్డి, రామచందర్‌రావు, మహేందర్‌రావు, శ్రీనివాస్, జనార్దన్, వెంకట్, హన్మంతరెడ్డి, వెంకటలింగం, బాలాకర్‌రెడ్డి, వెంకటేష్, ప్రజలు ఉన్నారు.

## రైతులు దళారులను ఆశ్రయించవద్దు

### వడ్యాల్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



లక్ష్మణచాంద : ప్రభుత్వం మక్కలకు మంచి ధరను నిర్ణయించి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని, రైతులు దళారులను ఆశ్రయించకుండా ఇక్కడే అమ్ముకోవాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మండల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి పెద్ద సంఖ్యలో వచ్చిన మొక్కజొన్న కంకులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మక్కలకు మంచి డిమాండ్ పెరిగిందని పెద్దపెద్ద హోటల్స్‌లో వివిధ రకాల పదార్థాలను తయారు చేసేందుకు వాడుతున్నారని, నాణ్యమైన మక్కలను రైతులు తీసుకువస్తే బాగుంటుందన్నారు. 14శాతం తేమ ఉండేలా చూసుకోవాలని ప్రభుత్వం రూ.1425 మద్దతు చెల్లిస్తుందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించి త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 40టీఎంసీల నీరుమాత్రమే నిల్వఉందని, మరో 25టీఎంసీల నీరు చేరితే రెండవపంటకు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. వచ్చే జూన్ నాటికి మేడిగడ్డ నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్‌లోకి నీటిని తీసుకువచ్చి రోజుకు ఒక టీఎంసీ నీటిని నిల్వచేసే కార్యక్రమం వేగంగా కొనసాగుతుందన్నారు. గత మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో 12గోడౌన్లు మంజూరు ఇస్తే కేవలం మూడింటిని మాత్రమే పూర్తిచేశారని అన్నారు. సకాలంలో పూర్తయితే రైతులకు అందుబాటులోకి వస్తాయన్నారు. వడ్యాల్ కొనుగోలు కేంద్రం వద్ద సీసీ ఏర్పాటు చేయాలని, వడ్యాల్‌ను వ్యవసాయ క్లస్టర్‌గా మార్చాలని గ్రామస్థులు విన్నవించగా రూ.10లక్షలు మంజూరు చేస్తానని, క్లస్టర్ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. జేసీ శివలింగయ్య మాట్లాడుతూ 70వేల మెట్రిక్‌టన్నుల మొక్కజొన్నలు జిల్లాలో కొనుగోలు చేసేందుకు అంచనా వేసినట్లు చెప్పారు. చెత్తా, చెదారం లేకుండా 14శాతం తేమ వచ్చేలా మక్కలను తీసుకురావాలన్నారు. విక్రయించిన రైతులు పట్టాపాసుపుస్తకం, బ్యాంకు, ఆధార్ నఖలుతో పాటు, గ్రామ రెవెన్యూ అధికారిచే ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులకు అందించాలన్నారు. రైతులు మక్కలు విక్రయించిన తరువాత 48గంటల్లో డబ్బులు వారి ఖాతాలో జమచేస్తామన్నారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తమ పంటలను కాపాడుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రక్షణ కోసం టార్పాలిన్లు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కౌసల్య, మండల ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, సర్పంచులు జ్యోతి, నారాయణ, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, గ్రంథాలయాల చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ శ్రీధర్, మార్క్‌ఫెడ్ డీఎం నాగేశ్వర్‌రావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నారాగౌడ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచందర్, పీఎసీఎస్ డైరెక్టర్ నరేష్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో వనజ, ఆర్ఐ నగేష్, మండల నాయకులు అట్ల రాంరెడ్డి, పోతారెడ్డి, లింగాగౌడ్, గణేష్, రమణగౌడ్, ముత్యంరెడ్డి, గంగారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వృద్ధులకు సపర్యలుచేసి వారి ఆయుష్షు పెంచుదాం

### - మంత్రి జోగురామన్న

## ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



శాంతినగర్ : వృద్ధులకు అవసరమైన సపర్యలు చేస్తూ వారిని ఆదరించడం వల్ల వారి ఆయుష్షును పెంచాలని మంత్రి జోగురామన్న అన్నారు. జిల్లాకేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమశాఖ, తెలంగాణ వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మన జీవితాలకు బాటలు వేసిన వృద్ధులను నిరాదరణకు గురిచేయకుండా వారికి అవసరమైన సపర్యలు చేస్తూ వారి ఆరోగ్యాన్ని పెంపొందించాలన్నారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు తమ పుత్రులు దగ్గరుండి చేసే సేవలోనే వారికి సంతృప్తి లభిస్తుందన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించి వృద్ధుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లి నవమాసాలు మోసి మనకు జన్మనిస్తే తండ్రి పుత్రులు ప్రయోజకులు అయ్యే వరకు కష్టాలను భరిస్తారన్నారు. ఎవరైనా వృద్ధులు నిరాదరణకు గురై సమస్యలు ఎదుర్కొంటే తనను నేరుగా సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

రిమ్స్ సంచాలకుడు కె.అశోక్ మాట్లాడుతూ వయోవృద్ధులు, ఉద్యోగులు, జర్నలిస్టులకు వైద్యసేవలు అందించేందుకు వెల్‌నెస్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీపావళి నుంచి సేవల్ని అందిస్తామన్నారు. వయోవృద్ధుల సమాఖ్య రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కస్తాల సుధాకర్ మాట్లాడుతూ వృద్ధులకు బస్సు ప్రయాణంలో 50శాతం రాయితీ కల్పించి, వృద్ధుల సంరక్షణకు డేకేర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. వృద్ధుల సంక్షేమాన్ని కాంక్షించి సేడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను మంత్రి జోగురామన్న ఆవిష్కరించారు.

కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రంగినేనిమనీష, మహిళా, శిశు, వికలాంగ, వృద్ధుల జిల్లా సంక్షేమ అధికారిణి మిల్కా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజీవ్‌రాజ్, సేడ్స్ స్వచ్ఛందసంస్థ నిర్వాహకుడు సురేందర్, వయోవృద్ధుల సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి టి.సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంకులకర్ణి, నాయకులు కోరెడ్డిశివన్న, శేషగిరి, రహీమోద్దీన్, కె.సురేష్, టి.భాస్కర్, గోలిరాజన్న, ఎన్.కిషన్, యు.మధుకర్, నర్సింలు, అజీం, భూమన్న, గంగాధరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి వచ్చిన వయోవృద్ధులకు రిమ్స్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జిల్లాకేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి వచ్చిన వయోవృద్ధులకు వైద్యసిబ్బంది ఆరోగ్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఔషధాలను అందజేశారు. 80 ఏళ్లు దాటి తమ పనులు తామే చేసుకుంటున్న 16 మంది వృద్ధులకు జ్ఞాపికలు అందజేసి మంత్రి సన్మానించారు.

# విజయభాను

## సంపాదకీయం

### రాజకీయానికి కొత్త ముఖాలు

తనకంటూ విలక్షణ రాజకీయ సంస్కృతి ఉన్న తమిళనాడులో కొత్త ముఖాలు ప్రవేశిస్తున్నాయనేది ఇప్పటికే ఖాయమైపోయింది. ప్రముఖ సినీ నటులు కమల్ హాసన్, రజనీకాంత్ రాజకీయ ప్రవేశం కోసం రంగం సిద్ధం చేసుకుంటున్నారు. కమల్ హాసన్ బుధవారం అభిమాన సంఘాలతో సాగించిన చర్చ మొదటిదేనని, ఇక ముందు ఇటువంటి చర్చలు కొనసాగుతాయని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. జనవరిలో పార్టీని ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన కమల్ హాసన్ మరింత ముందుగా నవంబర్‌లోనే స్థాపించనున్నట్టు తెలుస్తున్నది. అధికారపార్టీ అన్నాడీఎంకే అనిశ్చితితో కొట్టుమిట్టాడుతున్నది. ప్రభుత్వం కుప్పకూలిపోతే తొందరగా ఎన్నికలు రావచ్చునని, కమల్ హాసన్ తన ప్రయత్నాలను వేగవంతం చేసి ఉంటారు. రజనీకాంత్ గత మే, జూన్ నెలల్లో రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్నట్టు వెల్లడించారు. కానీ ఆ తరువాత గుంభనంగా ఉంటున్నారు. బుధవారం నాడు ఆయన భార్య లత రజనీకాంత్ రాజకీయాల్లో ప్రవేశించినప్పుడు చాలా మార్పు తీసుకొస్తారు అని చెప్పడం చర్చానీయాంశం అయింది. అయితే ఆయన ఎప్పుడు రాజకీయ ప్రవేశం చేసేది ఆమె వెల్లడించలేదు. తమిళనాడు రాజకీయాలు కొన్ని దశాబ్దాలుగా రెండు ద్రవిడ పార్టీల చుట్టూ తిరుగుతున్నాయి. కరుణానిధి వృద్ధాప్యం మూలంగా క్రియాశీలంగా వ్యవహరించలేకపోయినప్పటికీ, ఇప్పటికే ఆయన కుమారుడు స్టాలి న్ పార్టీ పగ్గాలు చేపట్టారు. అన్నాడీఎంకే నాయకురాలు జయలలిత హటాత్తుగా అస్వస్థతకు గురై మరణించడంతో మరో రాజకీయ కేంద్రంలో శూన్యం ఏర్పడ్డది. దీంతో రాజకీయ ప్రవేశానికి ఇది అనుకూల సమయమని ఇరువురు నటులు భావిస్తుండవచ్చు. కమల్ హాసన్‌కు 62 ఏండ్లు కాగా, రజనీకాంత్ వయసు 65. సినీ రంగంలో కొన్ని దశాబ్దాల పాటు వెలిగిపోయిన ఈ నటులు తమ జనాకర్షణను పునాదిగా చేసుకొని రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకోవాలని అనుకుంటున్నారు. తమిళనాడులో సినీ రంగానికి రాజకీయాలకు పీటముడి పడి ఉన్నది కనుక, ఈ ఇరువురి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే ఆసక్తి తమిళనాడులోనే కాదు, దేశవ్యాప్తంగా వ్యక్తమవుతున్నది. ద్రవిడ రాజకీయాల స్వభావానికి అనుగుణంగా ఉంటారా, రాష్ట్రాన్ని కొత్త బాట పట్టిస్తారా అనే చర్చ కూడా సాగుతున్నది. కమల్ హాసన్ తనకు తాను హేతువాదినని చెప్పుకుంటున్నారు. ఇటీవల రాజకీయ ప్రవేశం ఖాయమైన తరువాత, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆమ్ ఆద్మీ పార్టీ నేత కేజ్రీవాల్‌తో చెన్నైలో సమావేశమయ్యారు. కేరళ వెళ్ళి కమ్యూనిస్టు నేత, ముఖ్యమంత్రి విజయన్‌ను కలుసుకొని చర్చించారు. నా రంగు కాషాయం కాదని మొదట చెప్పినప్పటికీ, ఇప్పుడు ఆచితూచి వ్యవహరిస్తున్నా రు. తనను ప్రజలు రాజకీయంగా ఎంత వరకు ఆదరిస్తారో తెలువదు. అందువల్ల మొదట్లో మాట్లాడినట్టు కాకుండా, బీజేపీకి కొంచెం తలుపు తెరిచి పెట్టారు. ఇటీవల రజనీకాంత్‌ను కలుసుకున్నప్పుడు, ఇరువురి దారులు వేరైనా శత్రుభావంతో ఉండకూడదని, అవసరమైతే కలిసి పని చేయాలని ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది. రజనీకాంత్‌కు బీజేపీతో భావసారూప్యం ఉన్నది. తమిళనాడులో ఏర్పడిన పరిస్థితిని ఆసరాగా చేసుకొని ఇప్పటికే పరోక్షంగా పట్టుబిగించింది. రజనీకాంత్ బీజేపీలో చేరుతారనే మాట కూడా ఒక దశలో వినిపించింది. ద్రవిడ రాజకీయాలకు నిలయమైన తమిళనాడులో బీజేపీ స్వయంగా నిలదొక్కుకోవడం కష్టమనే భావన ఉన్నది. అందువల్ల భావసారూప్యం ఉన్న రజనీకాంత్ రంగంలో ఉండటం ఆ పార్టీకి అనుకూలాంశం. కానీ రజనీకాంత్ స్థానికేతరుడనే ముద్ర ఇప్పటికే పడిపోయింది. కారణం ఏమిటో కానీ, ఆయన రాజకీయాల పట్ల ఆసక్తి ప్రకటించినా, ఇంకా తటపటాయిస్తున్నట్టు కనిపిస్తున్నది. సినిమా ప్రపంచంలో సంపాదించుకున్న పేరు ప్రతిష్ఠలు రాజకీయాలలో తనదైన ముద్ర వేయడానికి తోడ్పడవు... ప్రజా జీవితంలో విజయం సాధించడానికి అంతకు మించినది ఉం డాలె. అది ఏమిటన్నది నాకు తెలువదు. కమల్ హాసన్‌కు తెలిసి ఉండవచ్చు అని రజనీకాంత్ ఇటీవల శివాజీ గణేశన్ స్మారక ఆవిష్కరణ సభలో అన్నారు. ఈ సభకు కమల్ హాసన్ కూడా హాజరయ్యారు. రాజకీయాలలోకి దిగడానికి సంకోచిస్తున్న రజనీకాంత్, తనకన్నా ఎక్కువ హడావుడి పడుతున్న కమల్ హాసన్‌కు చెప్పిన హితవు ఇది. సినీ రంగం నుంచి వచ్చి రాజకీయాలలో స్థిరపడిన వారు కొందరు ఉన్నప్పటికీ, విఫలమైన వారు అనేకమంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్టీఆర్ సినిమా గ్లామర్ వల్ల సఫలమైనట్టు పైకి ప్రచారం జరిగినప్పటికీ, ఆంధ్ర పాలకవర్గం తెరవెనుక ఉండి పార్టీని పెట్టింది, నడిపించింది. ఈ రాజకీయం వెనుక అనేక సామాజిక, ఆర్థిక కారణాలు ఉంటాయి మరి!

## మారుతి సుజుకి ప్లాంట్‌లోకి అనుకోని అతిథి!



గుర్గాన్: హర్యానా మనేసర్‌లోని మారుతి సుజుకి ప్లాంటులోకి ఓ చిరుతపులి ప్రవేశించడంతో కార్ల తయారీ నిలిచిపోయింది. తెల్లవారు జామున 4 గంటలకు చిరుతపులి ఫ్యాక్టరీలోకి ప్రవేశించినట్టు సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో.. చిరుతను పట్టుకునేందుకు పోలీసులు, అటవీశాఖ సిబ్బంది రంగంలోకి దిగారు. సీసీటీవీల ద్వారా చిరుతపులి కదలికలను గమనిస్తూ దాన్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా రాత్రిపూట ఉద్యోగులు ఎవరూ ప్లాంట్లో లేకపోవడంతో అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఉదయం ఏడుగంటలకు ఫ్యాక్టరీకి వచ్చిన సిబ్బందిని, సెక్యూరిటీ గార్డులను అధికారులు ముందు జాగ్రత్తగా బయటే ఉంచారు. ఈ ప్లాంట్లో దాదాపు 2 వేల మంది వరకు పనిచేస్తున్నట్టు సమాచారం. వారంతా ఎప్పుడు చిరుతపులి బయటికి వస్తుందా.. పనిమొదలు పెడదామా అన్నట్టు ఎదురుచేస్తున్నారు. కాగా చిరుతను సురక్షితంగా పట్టుకునేందుకు 100 మందికి పైగా రెస్క్యూ సిబ్బంది పనిచేస్తున్నట్టు డీసీపీ అశోక్ బక్షి వెల్లడించారు.

## బీఎస్ఎఫ్ సైనిక అధికారి ఆత్మహత్య

న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్)కి చెందిన ఓ జవాను ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఒడిశాలోని మల్కాన్‌గిరిలో బుధవారం రాత్రి సైనికుడు ధరమ్ సింగ్ తనను తాను కాల్చుకుని చనిపోయినట్టు అధికారులు వెల్లడించారు. నాయక్‌గూడా ప్రాంతంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. వెంటనే అతడిని మల్కాన్‌గిరి జిల్లా ఆస్పత్రికి తరలించినప్పటికీ.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

నాయక్‌గూడలోని 85 బెటాలియన్‌లో సైనికాధికారిగా పనిచేస్తున్న ధరమ్ సింగ్... కుటుంబ కలహాలు, మానసిక ఒత్తిడి కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు. ఇప్పటికే దీనిపై విచారణ ప్రారంభించినట్టు మల్కాన్‌గిరి పోలీసులు వెల్లడించారు.

## కమల్, రజినీ రాజకీయాల్లోకి వస్తే అలా చేయాలి: సినీ నటుడు వివేక్



చెన్నై : రాజకీయ రంగప్రవేశం చేయడం సులభమని కానీ, నిలదొక్కుకుని రాణించడం కష్టమని సినీ నటుడు వివేక్ అభిప్రాయపడ్డారు. ఆయన సారథ్యంలోని పసుమై సైదై పథకం కింద సైదాపేట అసెంబ్లీ నియోజకవర్గంలో 2 లక్షల మొక్కలను నాటే కార్యక్రమాన్ని గతంలో డీఎంకే కార్యాచరణ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా 2 వేల మొక్కల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా నటుడు వివేక్ మాట్లాడుతూ... ప్రజాబలమే శక్తిమంతమైనదన్నారు. తాము చేపట్టిన మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ సాయాన్ని ఎదురుచూడకుండా ప్రజలే స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి తమ అసరాలను తీర్చుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో డెంగీ జ్వరాలు ఎక్కువగా నమోదవు తున్నా యన్నారు. ఈ జ్వరం బారిన పడకుండా ప్రజలే తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు. రాజకీయం అనేది ఒక సేవ అని, దాన్ని గ్రహించిన నేతలు గతంలో రాజకీయాల్లోకి వచ్చారన్నారు. తనకు రాజకీయాలు తెలియవన్నారు. కానీ, రాజకీయాల్లో లేకుండా సేవ చేయడం తెలుసన్నారు.

ఇపుడు తాను అదే చేస్తున్నట్టు చెప్పారు. రాజకీయాల్లో లేనివారు నిర్వహించే అన్ని కార్యక్రమాలకు తనను ఆహ్వానిస్తున్నారన్నారు. తమిళ సూపర్‌స్టార్లు రజినీకాంత్, కమల్‌హాసన్‌లు రాజకీయాల్లోకి వచ్చినట్టయితే వారు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవ చేయాలని ప్రజల తరపున కోరుతున్నట్టు చెప్పారు.

అనంతరం సిట్టింగ్ ఎమ్మెల్యే ఎం. సుబ్రమణియన్ మాట్లాడుతూ.. సైదాపేట నియోజకవర్గంలో దాదాపు 3.25 లక్షల మంది ఓటర్లు ఉన్నారనీ, వీరిలో 2 లక్షల మంది తమ పుట్టిన రోజునాడు మొక్కలు నాటాలని కోరారు. వారు ఎలాంటి శ్రమకు లోనుకావాల్సిన పని లేదన్నారు. ఒక్క పిలుపుతో తామే వారి ఇంటి ముంగటకు వచ్చి మొక్కను అందజేస్తామన్నారు.

## పోలీస్ కుర్చీలో రాధే మా..
## చేతులు జోడించి నిల్చున్న పోలీస్ అధికారి



దిల్లీ: వివాదాస్పద సాధ్వీ రాధే మా మరోసారి వార్తల్లోకెక్కారు. దిల్లీలోని ఓ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఆమె.. ఏకంగా స్టేషన్ హౌస్ అధికారి(ఎస్‌హెచ్‌వో) కుర్చీలో కూర్చున్నారు. అంతేగాక.. ఆమె ముందు ఎస్‌హెచ్‌వో చేతులు జోడించి నిల్చున్నారు. గతవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన ఫొటో ఒకటి నేడు బయటకు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కాగా.. రాధేమా పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు సదరు పోలీస్ అధికారి కూడా ఒప్పుకున్నారు.

తూర్పు దిల్లీలోని వివేక్ విహార్ పోలీస్ స్టేషన్‌కు గతవారం రాధేమా వెళ్లారు. స్టేషన్ అధికారి కుర్చీలో రాధేమా కూర్చుని ఉండగా.. ఆమె ముందు ఎస్‌హెచ్‌వో చేతులు జోడించి నిల్చున్నారు. ఫొటోలో పోలీస్ అధికారి నవ్వుతూ కన్పించడమే గాక.. ఎర్ర రంగు చున్నీని మెడకు చుట్టుకున్నారు. ఈ ఫొటో గురువారం బయటకు వచ్చింది. దీంతో రాధే మాను పోలీసులు వీవీఐపీలా గౌరవించారంటూ వార్తలు వెల్లువెత్తాయి. దీనిపై స్టేషన్ అధికారి సంజయ్ శర్మను ప్రశ్నించగా.. రాధేమా వచ్చినట్లు అంగీకరించారు. కొద్ది నిమిషాల పాటు ఆమె నా కుర్చీలో కూర్చున్నారు. నేను చేతులు జోడించి ఆమెను వెళ్లిపోవాల్సిందిగా కోరాను. అని శర్మ చెప్పారు.

సెప్టెంబర్ 28న 11.30 గంటల సమయంలో మా స్టేషన్ ముందు నుంచి రాధేమా తన అనుచరులతో కలిసి రామ్‌లీలా ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో ఆమె అనుచరులు కొందరు వచ్చి రాధేమా బాత్రూంకు వెళ్లాలని చెప్పారు. అందుకు నేను అంగీకరించాను. ఆమె లోపలికు వచ్చి టాయిలెట్ ఉపయోగించుకున్నారు. అనంతరం నన్ను అడగకుండానే నా కుర్చీలో కూర్చున్నారు. నేను వెంటనే ఆమెను వెళ్లిపోవాలని కోరాను. అదంతా కేవలం నిమిషాల్లోనే జరిగిపోయింది. అని చెప్పారు. ఘటనపై ఉన్నతాధికారులు స్పందించారు. దర్యాప్తు చేపట్టామని.. దీనిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## కవి సమయం

### రణతంత్రమా - ఋణతంత్రమా?

రణతంత్రం ఋణతంత్రం
గుణింపుదారుల రణతంత్రం...
గరం గరంగా వస్తుంది, వరవంగా పోతుంది
ఉన్నవాడికే ఉన్నతనం, లేనివాడికి లేమితనం
సగటు మనిషికి వెర్రితనం
పంచి యిచ్చిన ఋణతంత్రం
రణాలు పెంచిన ఋణతంత్రం
రణాలు తెచ్చిన రణతంత్రం
దీపం పథకం పెట్టిననాడే దీపాలార్పిన రణతంత్రం
భాషా భేదాల్ రుచిచూపి
కులమత భేదాల్ రగిలించి
సర్వం సమానం అంటూనే కులాల కురుక్షేత్రం సృష్టించే...
ఆదిపదిలో ఆర్భాటం, రెండవ పదిలో యిరకాటం
మూడో పదిలో ముప్పుతిప్పలు
నాలుగో పదిలో నలుగులాటలు
అయిదో పదిలో అంతా శూన్యం
పన్నులు పెంచిన ఋణతంత్రం
సొమ్ములు మ్రింగిన ఋణతంత్రం
పేదరికాన్ని పెంచిన తంత్రం
వచ్చిందోయ్, వెళ్లిందోయి యీ తంత్రం
యంత్రాగారాలు పెట్టింది
తంత్రాగారాలు తెచ్చింది
వృత్తులు మూలన పెట్టింది
నెత్తికి చేతులు యిచ్చింది...
దగాకోరులు, దోపిడిదారులు
ధర్మరాజులైపోయారు
ధరలను పెంచుతూ దొరలైపోయారు
ఎందుకొచ్చిన యీ తంత్రం
ఎవడు మెచ్చిన తంత్రాలివి.
రణతంత్రం వచ్చిందోయ్
రుణతంత్రం యిచ్చిందోయ్
ఋణతంత్రం పెంచిందోయ్

...కవితా రచన
ప్రొ.అప్పాజి భగవాన్

## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : బహుళ పాడ్యమి రా.10.49; రేవతి రా.9.08; ఉ.వ.9.21ల 10.55

శుక్రవారం 06-10-2017

**మేషం** : ఖర్చులు అధికం. కోపతాపాలు అధికంగా వుంటాయి. స్త్రీలు తొందర పాటుతనం వల్ల ప్రియ తములను దూరం చేసు కుంటారు. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. **వృషభం** : దూర ప్రాంతాల నుంచి మంచి వార్తలు వింటారు. మీ ఉత్సాహాన్ని అదుపులో ఉంచుకోవటం శ్రేయస్కరం. వృత్తిపరమైన ఆటంకాలు క్రమంగా తొలగిపోగలవు. **మిథునం** : మిత్రులతో ఇష్టాగోష్టి చేస్తారు. తలపెట్టిన పనులు వేగవంత మవుతాయి. ప్రైవేటు, పత్రికా సంస్థల్లో వారికి మార్పులు వాయిదాపడతాయి. విదేశీ యత్నాలు వాయిదాపడతాయి. ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. భాగస్వామికుల మాటతీరు, కదలికలను ఎంతైనా మంచిది. బ్యాంక్ వ్యవహారాలలో మెళకవ వహించండి. **కర్కాటకం** : ఆరోగ్య విషయమై తగు జాగ్రత్త అవసరం. నరముల బలహీనత, మనోధైర్యం వలన అనుకున్న పనులు పూర్తి చేస్తారు. శారీరక శ్రమ, అకాల భోజనం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. **సింహం** : ప్రయాణ లాభం, ఆదాయానికి మించి ఖర్చులు చేస్తారు. శుభకార్యాలపై దృష్టి పెడతారు. మీ ఆలోచనలు ఫలిస్తాయి. **కన్య** : కార్యలాభం, గృహ లాభం, శుభకార్యలాభం, మిత్రుల సహాయ సహకారాలు లభించును. విందు, వినోదాలు, దూర ప్రయాణాలు చేస్తారు. **తుల** : చక్కని వ్యాపారాలు జరుగును. నూతన వస్తు, వస్త్ర లాభం, వాహన సౌఖ్యం కలుగును. చేయు వృత్తి వ్యాపారాలయందు అనుకూలత, దైవదర్శనం కలుగును. **వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు సంతృప్తిగా ఉండును. పాత రుణాలు వసూలు, శుభపరిణామాలు చోటుచేసు కుంటాయి. వ్యాపారాల్లో నిలదొక్కుకోవటానికి మరిం తగా శ్రమించవలసి ఉంటుంది. **ధనుస్సు** : బంధుమిత్రులతో విందు వినో దాల్లో పాల్గొంటారు. విద్యార్థులకు మిత్రబృందాల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కా రం ఉంది మెళకువ వహించండి. బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల మీ కృషికి తగిన ప్రతిఫలం ఉంటుంది. స్త్రీలతో అతిగా సంభాషించటం వల్ల అపార్థాలకు గురికావలసి వస్తుంది. **మకరం** : వ్యవహారానుకూలత, నూతన కార్యాములకు శ్రీకారం చుడతారు. ధైర్యంగా ముందుకు వెళతారు. నూతన పరిచయాలు వలన లాభం కలుగును. పత్రికా సంస్థలలోని వారికి పనిభారం, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికం. నిర్మాణ పనులలో జాప్యం, అధిక వ్యయం వల్ల ఆందోళనకు గురవుతారు. రావలసిన ధనం వాయిదాపడుట వల్ల ఆందోళనకు గురవుతారు. **కుంభం** : వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు, మీ మాట లెక్కచేయకుండుట, శరీర అలసట, అధిక ధనవ్యయాలు, వృత్తి వ్యాపారాలు అనుకూలించిననూ కోపం అధికం వలన అందరితోను విరోధాలు కలుగును. **మీనం** :యశోభూషణ ప్రాప్తి, నూతన పరిచయాలు లాభించును. శుభమూలక ధనవ్యయం, విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.



## విశ్వసిస్తేనే భగవద్దర్శనం

### సంకీర్తన

భగవంతుడు సాధు రక్షణార్థం, ధర్మ సంస్థాపనార్థం ఏ రూపంలోనైనా గోచరించ గలడు. అదే భగవంతుని అవతార విశిష్టత. ఆయనను సంపూర్ణంగా విశ్వసించక పోతే బాధపడక తప్పదు. విశ్వసిస్తే ఆత్మగత సంబంధం ఏర్పడుతుంది. దేవుడి శక్తి మనలో నిండి ఉంటుంది. కనుక అప్పుడు ఎవరిలోనైనా దైవత్వం కనపడుతుంది.

ఇలాంటి భావం అందరిలో ఏర్పడకపోవడానికి కారణం, దేవుడు లేడని కాదు మనకు దేవుడు కనపడాలన్న కోరిక బలంగా లేకపోవడం. కోరికలు మహారాజును కూడా కటిక పేదవాడిగా మార్చగలవు. కనుక భక్తులు కోరికలకు దూరంగా భగవంతుడికి దగ్గరగా ఉండేందుకు ప్రయత్నించాలి. మనకు అవసరమైనవన్నీ భగవంతుడే అడక్కుండా సమకూరుస్తాడు.

మనం కోరుకున్న కోరికలలో ఏవైనా తీరలేదంటే అవి మనకు మేలు చేయనివని దేవునికి అనిపించి ఉండాలి. అందుకే పరమాత్మ మనకు అనుగ్రహించలేదని తెలుసుకోవాలి.

ఈనాడు భగవంతుని గురించి వినడానికి ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. అయినా వారిలోని అశాంతిని పారదోలుకోలేకుండా వున్నారు. ఎన్నో ఉపదేశాలు వింటున్నారు.

ఎన్నో సేవాకార్యక్రమాలు వ్యక్తిగతంగా, సామాజిక పరంగా చేస్తున్నారు. అయినా వారిలో శాంతి లేదు. వినడమొక్కటే సరిపోదు. భక్తితో భగవంతుడిని సేవించినప్పుడే బ్రతుకు పునీతమవుతుంది.

మనఃపూర్వకంగా భగవంతుణ్ణి ధ్యానించే వారికి అసంతృప్తి అనేది వుండదు. తన గురించి మనకెంత తెలుసునని ఆయన ఆలోచించడు, ఆయనకోసం మనమెంత తపిస్తున్నామనేదే ఆయన వీక్షణ. దేవుడు మన భక్తి విషయంలో సదా మేల్కొనేట్టుగా మన పూజలు వుండాలి. అంతేగానీ ఉన్నాడో లేడోనని పదిమందిని పోగేసి మీమాంసలు చేయవద్దు. సంశయాత్ములకు భగవంతుడు సందేహాస్పదుడే! దైవ కార్యాలకు వచ్చే విఘ్నాలను దైవమే పోగొట్టాలి.

తన శక్తి పైన గాక పరమాత్మ శక్తి పైన ఆధారపడి జీవించే వాడు భక్తుడు. మూడవ నేత్రం ముక్కంటికే గాదు, మనుష్యులందరికీ ఉంది. అదే జ్ఞాన నేత్రం. ఎవరికి జ్ఞాననేత్రం తెరుచుకుంటుందో వారు గర్వాన్ని దగ్ధం చెయ్యగలరు.

సర్వం జ్ఞాన ప్లవే నైవ వృజినం సంతరిష్యసి జ్ఞానమనే తెప్పచే పాపరాశిని దాటగలవని శ్రీకృష్ణుడు గీతలో బోధించాడు. భగవంతుని యందు సంపూర్ణ విశ్వాసం వుంచిన వాడికి జగమంతా వెలుగులే!

# కిడ్నీలు ఫెయిలైతే?




మన శరీరంలో అతిముఖ్యమైన అవయవా లలో కిడ్నీలు (మూత్రపిండాలు) జీవనక్రియల్లో ప్రధాన పాత్ర పోషిస్తాయి. మనం తీసుకునే ఆహారపు అలవాట్లు, ఇతర్రతా కారణాల వల్ల కిడ్నీ సంబంధ సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ప్రతి యేటా 17శాతం కిడ్నీ సంబంధ సమస్యలు పెరుగుతున్నట్లు అంచనా.

**యురినరీ ఇన్‌ఫెక్షన్.......**

మూత్రం పోసే టప్పుడు మంటగా ఉండటం, మాటి మాటికి యూరిన్‌రావడం, బొడ్డు కిందభాగంలో నొప్పి, జ్వరం రావడం యురినరీ ఇన్‌ఫెక్షన్ ముఖ్యలక్షణాలు. దీన్ని మందులతో పూర్తిగా నయం చేయవచ్చు. ముఖ్యంగా పిల్లలలో దీనికి చికిత్స ఇస్తున్నప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు పాటించడం అవసరం. చికిత్స ఇవ్వడం ఆలస్యం చేసినా, సరె%న చికిత్స ఇవ్వకపోయినా కిడ్నీలు దెబ్బతినే అవకాశముంది.

**డయాలసిస్......**

శరీరంలో రెండు కిడ్నీలు పాడె%పోయి నప్పుడు శరీరంలో అనవసరమె%న, విజర్జించబడిన పదార్థాలు, నీటి పరిణామము ఎక్కువగా ఉన్నప్పుడు వాటిని బయటకు పంపించే ప్రక్రియను డయాలసిస్ అంటారు.

మిషన్ ద్వారా రక్తాన్ని శుద్ధి చేయడం **(హిమోడయాలసిస్).....**

ఈ పద్ధతిలో హీమోడయాలసిస్ అనే మిషన్ సాయంతో కత్రిమ కిడ్నీ (డయలైజర్)లో రక్తాన్ని శుద్ధి చేస్తారు. మిషన్ సాయంతో రక్తాన్ని శుభ్రపర్చి తిరిగి శరీరంలోకి పంపుతుంటారు. రోగి ఆరోగ్యకరంగా ఉండటానికి వారానికి రెండు లేక

మూడు సార్లు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. హీమోడయాలసిస్ చేసుకునే సమయంలో మంచంపై ఉండగానే రోగి ఆహారం తీసుకోవడం, టీవి చూడటం వంటి పనులు చేసుకోవచ్చు. ప్రతి సారి డయాలసిస్ చేసుకునేందుకు 4గంటల సమయం పడుతుంది.

ప్రతీ సంవత్సరం మార్చి-10న వరల్డ్ కిడ్నీడేను జరుపుకుంటాం. ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్యసంస్థ పిల్లల్లో కిడ్నీ సంబంధ సమస్యలు - ప్రజల్లో అవగాహన'' అనే అంశాన్ని థీంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారు. వీరిలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే కిడ్నీ సంబంధ సమస్యలు, ఇతర కిడ్నీ సంబంధ సమస్యలను మొదట్లోనే గుర్తిస్తే చికిత్సను అందించడంతో వారు ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు అవకాశముంటుంది. పిల్లల్లో కిడ్నీ సంబంధ అనారోగ్యాలు వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. సాధారణ ఇబ్బందుల నుంచి మొదులుకొని ప్రాణహాని వరకు దారితీయవచ్చు.

చిక్కుడు గింజ ఆకారంలో ఉండే రెండు మూత్రపిండాలు ఉంటాయి. ఇవి కడుపులో వెనుక భాగంలో వెన్నెముకకు ఇరువె%పులా ఛాతికి కింది భాగంలో ఎముకల మధ్య సురక్షితంగా ఇమిడి ఉంటాయి. ప్రతీ వ్యక్తిలో కిడ్నీ సాధారణంగా 10సెంటీమీటర్ల పొడవు, 5సెంటీమీటర్ల వెడల్పు ఉంటుంది. దీని బరువు 150 నుంచి 170 గ్రాముల వరకు ఉంటుంది. కిడ్నీలు శరీరంలోని రక్తన్ని శుద్ధిచేసి వ్యర్థాలను మూత్రవిసర్జన ద్వారా బయటకు పంపుతుంది. వీటితో పాటు శరీరంలో నీటిసమతుల్యత, బ్లడ్ ప్రెషర్, రక్తపు గడ్డలు, కాల్షియం నియంత్రణ చేస్తుంది. మనశరీరంలో ప్రతి రెండు నిమిషాలకు రెండు కిడ్నీలలో 1200 మి.లీ. రక్తం శు భ్రమవుతుంది. 24 గంటల్లో సుమారు 1700 వందల లీటర్ల రక్తాన్ని శుద్ధి చేస్తుంది.




**కిడ్నీ వ్యాధి లక్షణాలు.......**

'ఉదయం నిద్రలేచిన వెంటనే కళ్ళు వాచి ఉండటం
'ఆకలి తక్కువగా ఉండటం, వాంతులు, వికారంగా అనిపించడం
'రాత్రిళ్ళు ఎక్కువగా మూత్రవిసర్జనకు వెళ్ళాల్సి రావడం
'చిన్న వయస్సులోనే రక్తపోటు వ్యాధి ఉండటం
'కొంచెం నడిచే సరికి ఆయాసం, నీరసంగా అనిపించడం
'6 సంవత్సరాల తరువాత కూడా మంచంపై మూత్రవిసర్జన చేయటం
'మూత్రవిసర్జన సమయంలో మంట, చీము, రక్తం రావటం, మూత్రం బొట్లు బొట్లుగా రావటం.
'కడుపులో పుండ్లు అవటం, కాళ్ళు, నడుములో నొప్పులు కలగటం వంటి లక్షణాలు సాధారణాలుంటే కిడ్నీ సంబంధ వ్యాధిగా గుర్తించి పరీక్షలు చేయించుకోవాలి.

**ఎక్యూట్, క్రానిక్ కిడ్నీ ఫెయిల్యూర్............**

ఎక్యూట్ కిడ్నీ ఫెయిల్యూర్ః-...ఎక్యూట్ కిడ్నీఫెయిల్యూర్‌లో క్రమబద్ధంగా పనిచేస్తున్న కిడ్నీలు హఠాత్తుగా తక్కువ సమయంలో పనిచేయకుండా పోతాయి. దీనికిప్రధాన కారణాలుగా తీసుకుంటే వాంతులు అవడం, మలేరియా, రక్తపోటు వంటి కారణాల వల్ల రావచ్చు.

**క్రానిక్ కిడ్నీ ఫేయిల్యూర్.......**

క్రానిక్ కిడ్నీ ఫేయిల్యూర్‌లో రె ండు కిడ్నీలు మెల్ల మెల్లగా దీర్ఘకాలంలో క్షీణిస్తుంటాయి. శరీరంలో వాపు రావడం, ఆకలి తక్కువగా ఉండటం, వాంతులు, నీసరం, మనస్సు సరిగ్గా లేకపోవడం, తక్కువ వయస్సులోనే రక్తపోటు ఎక్కువగా ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి.

# అజీర్తికి చెక్ పెట్టే పుచ్చకాయ

*వేసవికాలం వస్తోందంటే చాలు ప్రపంచంలో అందరికీ గుర్తుకొచ్చేది పుచ్చకాయ. దీన్ని ఖర్భూజ అని కూడా పిలుస్తారు. ఈ కాయ నిండా నీరే ఉంటుంది కాబట్టి ఇంగ్లీష్‌లో దీనికి వాటర్ మెలోన్ అనే పేరు స్థిరపడింది. తాపాన్ని చల్లార్చే చలవగుణం దీనికి ఉంది. దీనిలో ఔషధగుణాలు కూడా ఉన్నాయి. జీర్ణప్రక్రియకు బాగా దోహదపడడం దీని లక్షణం.*

***పుచ్చపండు వంటింటి వైద్యంలో ఎలా ఉపయోగపడగలదో చూద్దాం.***

*మూత్రవ్యాధులన్నిటినీ నివారించాలంటే పుచ్చపండును వేసవి కాలంలో తరచుగా తింటూండాలి. పుచ్చకాయకు బాగా చలవచేసే గుణముంది. ఇది వేసవిలో మాత్రమే లభిస్తుంది. ఎండదెబ్బ తగలకుండా చేస్తుంది.*

*ఎండవేడిమికి ఇది ఔషధం లాగా పనిచేస్తుంది. ఇక జీర్ణశక్తికి పుచ్చకాయ చాలా మంచిది. నీటి శాతం ఎక్కువగా ఉన్న పుచ్చకాయ శరీర జీర్ణప్రక్రియను సులువుగా, సజావుగా పనిచేయిస్తుంది. పుచ్చకాయ కడుపు నొప్పి, విరేచనాలను పోగొడుతుంది. పుచ్చపండు తింటే అజీర్ణంతో బాధపడే వారికి ఉపశమనం లభిస్తుంది. ఇంకెందుకు ఆలస్యం. మీరు కూడా పుచ్చకాయను వేసవిలో లాగించేయండి. వడదెబ్బ తగలకుండా మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి. అజీర్తి కాకుండా ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోండి!*

## 30 సంవత్సరాలు దాటిన పురుషులు...

# ఖచ్చితంగా చేయాల్సిన పనులు



ఒక మనిషి 18-20 సంవత్సరాల మధ్య చాలా బలంగా, శక్తివంతంగా ఉంటాడని అనేక సర్వేలు చెప్తున్నాయి! ఆ తరువాత, చురుకైన జీవనశైలి లేకపోతే క్రమంగా అతను తన బలాన్ని, గట్టి పటిమను కోల్పోతాడు. అందువల్ల, పురుషులు ఎల్లపుడూ ఆరోగ్య చిట్కాలను వ్యయమ చిట్కాలతో ప్రారంభించాలి. వయసు పెరగడం వాళ్ళ కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. బ్లేడ్ ప్రేసర్, మధుమేహం, ఊబకాయం సమస్యలు, పడకగది వైఫల్యాలు, నపుంసకత్వం, ఒత్తిడి వంటి రుగ్మతలు.

**30ఏళ్ళ తర్వాత మగవారు చేయకూడని 9 ఖచ్చితమైన పనులు** అవును, పురుషుల ఆరోగ్య చిట్కాలు సాధారణంగా వ్యాయామం మీద ఆధారపడి ఉన్నాయి, ఎందుకంటే కొన్ని దశాబ్దాలుగా యువత నుండి ఇవి విస్తరించి వస్తూ ఉన్నాయి కాబట్టి వాటిమీద నమ్మకం. కొలెస్ట్రాల్‌ను తగ్గించు కోవడానికి సహజమార్గాలు... ఆరోగ్యవం తమైన జీవితం కోసం, మంచి ఆహారం, సరైన వ్యాయామం అవసరం. పురుషులు 30 సంవత్సరాలు దాటిన తరువాత వారి సహజ టేస్తోస్తేరాన్ స్థాయిలను కోల్పోతారని గుర్తుం చుకోండి.

**పరీక్షించుకోండి** రక్తపోటు తక్కువగా ఉండేట్టు ప్రయత్నించండి. మీకు బ్లెడ్ ప్రేసర్ సాధారణంగా ఉన్నప్పటికీ, అది పెరగకుండా, ఆరోగ్యంగా ఉండడానికి మీ వైద్యుడిని సలహాలు అడగండి.

**కొద్దిగా ఫైబర్ ని తీసుకోండి** మీ ఉదయపు అల్పాహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండే ధాన్యాలు లేదా పచ్చి కూరగాయలు ఉండేట్లు చూసుకోండి. ఈ ఆహరం అనేక ఆరోగ్య సమస్యలను నిర్మూలిస్తుంది.

**మీ వెన్నుపూస మీద శ్రద్ధ పెట్టండి** ఊబకాయం ఉన్నవాళ్ళకు మాత్రమే వెన్నునొప్పి వస్తుందని అనుకోకండి. ఇది ఎవరికైనా, ఏ సమయంలోనైనా రావచ్చు. వెన్నునొప్పితో మీ జీవితాన్ని నరకం చేసుకోవద్దు, దాన్ని బలంగా ఉంచుకోండి.

**శృంగారాన్ని ఆస్వాదించండి** ప్రేమ, శృంగారం లేని జీవితం నెమ్మదిగా ఒత్తిడికి దారితీస్తుంది. ప్రేమతో కూడిన జీవితం గొప్పదని నిర్ధారించుకోండి. **బరువు పై దృష్టి ఉంచండి** మీరు 30 సంవత్సరాల వయసు దాటినపుడు, మీ జీవక్రియలో కొద్దిగా వేగం తగ్గుతుంది. దీనివల్ల మీరు రోజు కంటే కొంచెం తక్కువ తిన్నప్పటికీ బరువు పెరుగుతారు. **క్యాలరీలు కరగడానికి మార్గాలను వెతకండి** మెట్లు ఎక్కడం. పనిమీద కృషిచేయండి. ఒక కొత్త పంధాలో క్యాలరీలను కరిగించడానికి ఇలాంటి అనేక మార్గాలను ఆలోచించండి. ఇది మీరు బరువు పెరగకుండా కాపాడుతుంది. **మీ ఇష్టాలను వదిలేయండి** పొగత్రాగడం, మద్యం సేవించడం మీకు అపారమైన ఆనందాన్ని కలిగించినప్పటికీ 30 సంవత్సరాల వయసు దాటిన తరువాత మీ ఆరోగ్యం కోసం వాటిని మానేయడం మంచిది. **మీ గుండెను రక్షించుకోండి** చురుకైన జీవితం, కొవ్వులేని ఆహారం తీసుకోవడం ప్రధానాంశాలు.

గుండె ఆరోగ్యంగా ఉండడానికి ఇలాంటి నియమాలను పాటించండి.

# నిద్రలేమి సమస్యను నివారించే.. హెల్తీ బెడ్ టైమ్ డ్రింక్స్

**రాత్రుళు**

ౕ నిద్రించడానికి సమస్యగా ఉందా? అలాంటి వారికోసం నిద్రలేమి సమస్యకు పరిష్కారం ఉంది. నిద్రలేమి సమస్యను నయం చేసుకోవడానికి వివిధ రకాల మందులు, వంటింటి చిట్కాలు, ఆయుర్వేద ట్రీట్మెంట్స్ మరియు ట్రిక్స్ తో ఇప్పటికి విసిగెత్తిపోయారా? అయితే ఇవన్నీ కాకుండా కొన్ని బెవరేజెస్ (పానీయాలను )మీరు ఎప్పుడైనా ట్రై చేశారా? ఈ పానియాలు మీరు రాత్రుల్లో త్రాగడం వల్ల గాఢంగా మరియు పీస్ ఫుల్ గా నిద్రించేలా చేస్తాయి. నిద్రకు ఉపక్రమింపచేసే 13 ఆశ్చర్యకరమైన ఆహారాలు రీసెంట్ గా జరిగిన ఒక పరిశోధన ప్రకారం రాత్రి సమయాల్లో 8 రకాల పానీయాలు నిద్ర బాగా పట్టేందుకు ఉపయోగపడు తాయని కనుగొన్నారు . ఈ ఎఫెక్టివ్ డ్రింక్స్ మీరు గాఢంగా నిద్రపోయేలా చేయడం మాత్రమే కాదు, మరుసటి రోజు మీరు మరింత ఉత్సహాం, ఆరోగ్యంగా.. అందంగా కనబడేలా చేస్తాయి. వార్మ్ టీ, హెర్బల్ టీ , చాక్లెట్ టీ మరియు మరికొన్ని పానీయాల లిస్ట్ ను మీకోసం..మీరు ప్రయత్నించడం కోసం ఉన్నాయి. వీటిని ప్రయత్నించి మంచి నిద్రను పొందండి. ఇటు అనారోగ్యాన్ని... అటు నిద్రాభంగి మను కలిగించే 10 ఆహారాలు.. బాగా నిద్రపట్టాలంటే కాఫీకి దూరంగా ఉండాలి. ఇది మిమ్మల్ని మేల్కొనేలా చేస్తుంది. మరియు రాత్రుల్లో తీసుకొనే పానియాల్లో షుగర్ చేర్చకుండా తీసుకోవడం వల్ల మరింత యాక్టివ్ గా పనిచేస్తాయి.

మంచిగా నిద్రపట్టేలా చేస్తాయి. మరి 8 బెస్ట్ బెడ్ టైమ్ బెవరేజెస్ ఏంటో ఒక సారి ఈ క్రింది లిస్ట్ ద్వారా తెలుసుకుందాం. మంచి నిద్రతో మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం...

**హాట్ చాక్లెట్:** పాలలో హాట్ చాక్లెట్ సిరఫ్ ను మిక్స్ చేసి త్రాగడం వల్ల పొట్ట నిండుగా ఉన్న అనుభూతి కలిగిస్తుంది మరియు నరాలను విశ్రాంతి పరుస్తుంది.

**మింట్ టీ:** కొద్దిగా నిమ్మరంస మిక్స్ చేసి పుదీనా టీని త్రాగడం వల్ల చిన్న పిల్లలు నిద్రపోయినంత గాఢంగా మీరు నిద్రపోతారు. మీరు నిద్రించడానికి ఒక గంట ముందు ఈ టీని ప్రయత్నించండి.

**చామంతి టీ:** చమోమెలీ టి స్మూతింగ్ బెవరేజ్. రాత్రి పడుకొనే ముందు ఒక గంట ముందుగా త్రాగాలి. ఈ టీ త్రాగడం వల్ల నరాలను విశ్రాంతి పరుస్తుంది మరియు ఒత్తిడి తగ్గిస్తుంది.

**కోక్:** చాలా మంది ఎక్కువగా ఇష్టపడే మరో బెవరేజ్ హాట్ కోక్. నిద్రలేమితో బాధపడే వారు వేడిగా ఉండే కోక్ త్రాగితో స్మూత్‌గా నిద్రపట్టే స్తుంది. దీన్ని మీ డైలీ హ్యాబిట్ గా మార్చుకోవాలి.

**గోరువెచ్చని పాలు:** నిద్రలేమితో బాధపడుతు న్నట్లైతే మీరు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక స్పూన్ హనీ మిక్స్ చేసి నిద్రించడానికి ఒక గంట ముందు త్రాగితే మంచి నిద్రపడు తుంది.

**బాదం మిల్క్:** బాదం మిల్క్ లో విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల, బాదం పౌడర్ ను గోరువెచ్చని పాలలో మిక్స్ చేసి రాత్రి నిద్రించ డానికి ముందు త్రాగాలి.

**హనీ మిల్క్:** ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక టేబుల్ స్పూన్ తేనె మిక్స్ చేసి త్రాగడం వల్ల వెంటనే నిద్ర పట్టేస్తుంది.

**అల్లం టీ:** వేడి వేడి జింజర్ టీ త్రాగడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. పొట్ట లైనింగ్ కూల్ గా ఉంటుంది. గుడ్ నైట్ రెస్ట్ పొందుతారు.





# చిత్రభాను



## కంగనా ఈమెయిల్ సంచలనం

బాలీవుడ్ బ్యూటీ కంగనా రనౌత్, హీరో హృతిక్ రోషన్ మధ్య చోటు చేసుకున్న వివాదం గురించి అందరికీ తెలిసిందే. ఇద్దరి మధ్య జరిగిన ఈమెయిల్స్ వ్యవహారం 2014లో వెలుగు చూడగా, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు, కేసులు పెట్టుకోవడంతో తారా స్థాయికి చేరింది. అయితే ఈ వివాదం ఇంకా ముగియలేదు. తాజాగా ఈ వ్యవహారం బాలీవుడ్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ఓ న్యూస్ ఛానల్ ఈ విషయాన్ని మళ్లీ కదిలించింది. హృతిక్ రోషన్‌కు కంగనా పంపిన కొన్ని ఈమెయిల్స్ తాజాగా బయట పెట్టింది. ఈ ఈమెయిల్స్ హృతిక్ లీక్ చేసినట్లు అనుమానిస్తున్నారు. తాజాగా ఈ లీకైన ఈమెయిల్స్‌లో రణబీర్ కపూర్ ప్రస్తావన ఉండటం చర్చనీయాంశం అయింది. హృతిక్ లీక్ చేసినట్లు భావిస్తున్న కంగనా ఈమెయిల్స్ లో ఆర్‌కె(రణబీర్ కపూర్), క్యాట్(కత్రినా కైఫ్), ఆమె సిస్టర్ రంగు(రంగోలి చందల్) పేర్లు ఉండటం చర్చనీయాంశం అయింది. క్వీన్ తర్వాత క్వీన్ సినిమా ముందు వరకు రణబీర్ తనపై పెద్దగా ఆసక్తి చూపలేదని, ఆ సినిమా చూసిన తర్వాత తన పట్ల ఆసక్తి చూపాడని కంగనా పేర్కొన్నట్లు... లీకైన ఈమెయిల్స్ లో ఉంది. ఒకసారి తాను రివాల్వర్ షూటింగులో భాగంగా గ్వాలియర్ లో ఉండగా....తనను స్ట్రైట్ గా అప్రోచ్ అయ్యాడని, అయితే అపుడు తాను వేరొకరితో రిలేషన్ షిప్ లో ఉన్నట్లు తేల్చి చెప్పానని... కంగనా పేర్కొన్నట్లు లీకైన ఈమెయిల్స్ ఉంది. ఒకసారి న్యూయార్కులో ఉన్నపుడు రణబీర్ తనకు న్యూయార్క్ ఎలా ఉందని టెక్ట్ చేశాడు. నాతో ఫిజికల్ రిలేషన్ షిప్ పెట్టుకోవడానికి ఆసక్తి చూపుతున్నావా? అని అడిగాను, అతడు వెంటనే బెదిరిపోయాడు. నేను వెంటనే మనం రెగ్యులర్ రిలేషన్ షిప్ మెయింటేన్ చేద్దామని చెప్పాను, అప్పటికే నేను వేరొకరితో రిలేషన్ షిప్ లో ఉన్నట్లు చెప్పా. అపుడు అతడు కాస్త బ్యాడ్ ఫీలయ్యాడనిపించింది.... అని కంగనా పేర్కొన్నట్లు లీకైన ఈమెయిల్స్ లో ఉంది.

## అమల బాలీవుడ్ ఎంట్రీ.. ఆసక్తికరంగా నాగార్జున

అక్కినేని వారింట్లో నాగ చైతన్య, సమంత పెళ్లి వేడుక కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. ఓ వైపు పెళ్లి ఏర్పాట్లపై దృష్టి పెడుతూనే నాగార్జున త్వరలో విడుదల కాబోతున్న రాజు గారి గది2 సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. ప్రముఖ యాంకర్ ఓంకార్ దర్శకత్వంలో రాజుగారి గది1కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంలో నాగార్జున, సమంత, సీరత్ కపూర్ తదితరులు నటించారు. ఈ చిత్రం అక్టోబర్ 13న రిలీజ్ కానున్న నేపథ్యంలో టాలీవుడ్ మన్మథుడు నాగార్జున మీడియాతో ముచ్చటించారు. ఆయన వెల్లడించిన విషయాలు ఇవే. అక్టోబర్ 15న హలో షూటింగ్ పూర్తి చేసేస్తానని దర్శకుడు విక్రమ్ కుమార్ చెప్పారు. డిసెంబర్ 22న సినిమా విడుదలవుతుందని ముందే థియేటర్స్‌కు కూడా చెప్పేసుకున్నాం. డైరెక్టర్ విక్రమ్‌కు ఉదయం, సాయంత్రం ఫోన్ చేస్తున్నాను. ఏమైందని అడుగుతున్నాను. బ్యూటీఫుల్ లవ్‌స్టోరీ. సినిమా చాలా బాగా వస్తుంది. హలో చిత్రంలో ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కూతురు కళ్యాణి ప్రియదర్శిని హీరోయిన్‌గా పరిచయం అవుతుంది. ప్రియదర్శన్‌గారు నాతో, అమలతో నిర?యం సినిమా చేశారు. ఈ మధ్య ఆయన నాకు ఫోన్ చేసి అమ్మాయిని



హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. అన్నపూర? ఫిలిం స్కూల్‌లో స్క్రిప్ట్ విభాగాన్ని ఒకదాన్ని రెడీ చేశాం. దానికంటూ కొంత ఫండ్ కేటాయించాం. ఫిలిం స్కూల్ స్టూడెంట్సే స్క్రిప్ట్ తయారు చేస్తారు. వాళ్లే నటీనటులు, దర్శకులు, టెక్నికల్ టీంగా వ్యవహరిస్తారు. మా స్టూడియో నుంచి సినిమాను నిర్మిస్తాం. ఈ ప్రాసెస్ వచ్చే ఏడాది నుండి ప్రారంభం అవుతుంది. స్టూడెంట్స్ కోసం క్వాలిటీ ఫ్యాక్లటీస్‌ను తీసుకొస్తున్నాం. అలాగే గెస్ట్ లెక్చరర్స్ కూడా ఉన్నారు. అమల కూడా తన సమయాన్ని స్కూల్‌కు కేటాయిస్తుంది. లేటెస్ట్ టెక్నాలజీ తెలుసుకోవాలని అమల మళ్లీ సినిమాల్లో నటించడానికి రెడీ అయ్యింది. ఇప్పుడు ఓ బాలీవుడ్ సినిమాలో నటిస్తుంది. త్వరలోనే అమల నటించే బాలీవుడ్ చిత్ర వివరాలను వెల్లడిస్తాం అని నాగార్జున చెప్పారు.



## మీకు అమ్మ, అక్క, చెల్లి ఉన్నారుగా: రేణు దేశాయ్

పవన్ కళ్యాణ్‌తో విడిపోయి దాదాపు ఏడేళ్లుగా మగతోడు లేని జీవితం కొనసాగిస్తున్న రేణు దేశాయ్.... ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనకు ఇపుడు ఒక లైఫ్ పార్ట్‌నర్ ఉంటే బావుండనిపిస్తుందనే తన మనసులోని ఆలోచనను బయట పెట్టారు. దీనిపై కొందరు స్పందిస్తూ.... మీరు మరో పెళ్లి చేసుకోవడానికి వీల్లేదు, మేమంతా మిమ్మల్ని ఇప్పటికీ వదినమ్మగానే ట్రీట్ చేస్తున్నాం.

మీరు మరో పెళ్లి చేసుకుంటే మిమ్మల్ని హేట్ చేస్తాం అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ పెట్టారు. దీనిపై రేణు దేశాయ్ ఘాటుగానే స్పందించారు. తాను రెండో పెళ్లి చేసుకోకూడదు అంటూ కామెంట్లు పెట్టిన వారికి రేణు దేశాయ్ ఘాటుగా రిప్లై ఇవ్వడం మీడియాలో మరో రకంగా ప్రచారం జరిగింది. రేణు దేశాయ్ పవన్ కళ్యాణ్ అభిమానులకు వ్యతిరేకంగా ఈ పోస్టు పెట్టారంటూ కథనాలు వచ్చాయి.

మీడియాలో ఇలా రావడంపై రేణు దేశాయ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫేస్ బుక్ పోస్టులో తన ఎక్స్ హస్బెండ్ ఫ్యాన్స్‌ను ఉద్దేశించి అని ఎక్కడా మెన్షన్ చేయలేదని, అయినప్పటికీ కొన్ని మీడియా సంస్థలు తన పోస్టు పవన్ కళ్యాణ్ అభిమానులకు వ్యతిరేకంగా అని రాశారని.... తన ఉద్దేశ్యం అది కాక పోయినా వారు అలా రావడం బాధించిందని రేణు దేశాయ్ అన్నారు. నేను నా పోస్టులో చాలా క్లీయర్ గా రాశాను. ఇది నా పర్సనల్ ఇష్యూ గురించి కాదు అని. ఈ దేశ పౌరురాలిగా ఈ సమాజంలో కొందరు ఆలోచిస్తున్న తీరును నేను ఎండగట్టాను.... అని రేణు దేశాయ్ తెలిపారు.

అందరికీ నేను రిక్వెస్ట్ చేసేది ఒకటే. ఉమెన్ ఫ్రీడమ్, ఎడ్యుకేషన్, హెల్త్ సీరియస్ గా తీసుకోండి. మీ అందరికీ అమ్మ, అక్క, చెల్లి ఉన్నారు. ఇది నా కోసం కాదు, వాళ్ల కోసం చేయండి.

చదువు, పని విషయంలో సెక్యూర్, ప్రొటెక్టెడ్ ఫీలింగ్ వారికి కల్పించండి.... అని రేణు దేశాయ్ అభిప్రాయ పడ్డారు.

## పరిణయోత్సాహంలో...







నాగచైతన్య, సమంతల పెళ్లి ఘడియలు దగ్గరపడుతున్నాయి. శుక్రవారం గోవాలో జరిగే వివాహ వేడుకలో ఈ జంట మూడుముళ్ల బంధంతో ఒక్కటికాబోతున్నారు. పెళ్లికి ఇంకా రెండురోజులే మిగిలివుండటంతో వీరిద్దరు అవధుల్లేని ఆనందంతో కనిపిస్తున్నారు. తాజాగా నాగచైతన్య-సమంత కలిసి తీసుకున్న ఫొటోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ప్రేమజంట ఫుల్‌జోష్‌తో కనిపిస్తున్న ఫొటోలు అభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బ్రైడ్ వైబ్స్ అనే క్యాప్షన్ రాసివున్న తెల్లటి టీషర్ట్‌ను సమంతా ధరించగా ఆమె పక్కన చైతూ చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నాడు. అక్కినేని అభిమానులు ఈ ఫొటోలకు ఫిదా అవుతున్నారు. కాబోయే దంపతులకు అంతా శుభం జరగాలని ఆశీర్వదిస్తూ సందేశాలు పెడుతున్నారు. హిందూ, క్రిస్టియన్ సంప్రదాయ పద్ధతుల్లో గోవాలో రెండు రోజుల పాటు వివాహం జరగనుంది. వివాహానంతరం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రిసెప్షన్ ఏర్పాటు చేస్తున్నట్లు నాగార్జున ప్రకటించిన విషయం తెలిసిందే.

## బాహుబలి బ్రెయిన్ సర్జరీ..... సినిమా చూపిస్తూ ప్రాణాలు నిలబెట్టారు!



ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బాహుబలి సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. రెండు పార్టులుగా తెరకెక్కిన ఈ చిత్రం దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలను ఆకట్టకుంది. తాజాగా బాహుబలి సినిమా ఓ నర్స్ ప్రాణాలు కాపాడేందుకు వినియోగించారు అనే విషయం తెలిసి అంతా ఆశ్చర్యపోతున్నారు. బాహుబలి సినిమా రీల్ లైఫ్ లో మాత్రమే కాదు, రియల్ లైఫ్‌లో కూడా అదుతేాలు సృష్టించింది అని చర్చించుకుంటున్నారు. గుంటూరులోని ఓ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వినయ కుమారి అనే నర్స్ బ్రెయిన్ ట్యూమర్ చికిత్స కోసం జాయిన్ అయింది. ఆమెకు సర్జరీ చేసేందుకు బాహుబలి సినిమా సహాయం కూడా తీసుకున్నారు డాక్టర్లు. సెప్టెంబర్ 21వ తేదీన సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. ట్యూమర్ తొలగించేందుకు బ్రెయిన్ సర్జరీ చేసే సమయంలో ఆమె తప్పకుండా మెలకువగా ఉండాల్సిన పరిస్థితి ఉంది. సర్జరీ చేసే సమయంలో ఆమె మెలకువగా ఉండేందుకు ల్యాప్ టాప్ లో బాహుబలి-ది కంక్లూజన్ సినిమాను ప్రదర్శించారు వైద్యులు. వినయ కుమారికి సర్జరీ నిర్వహించిన డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.... సర్జరీ చేసే సమయంలో పేషెంట్ మెలకువగా ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే ఆపరేషన్ చేసే సమయంలో ఆమెకు బాహుబలి సినిమా చూపించాం. ఆమె సినిమా చూస్తూ ఎంజాయ్ చేస్తుండటం వల్ల... మేము ఆమెకు ఎలాంటి నొప్పి కలగకుండా విజయవంతంగా పూర్తి చేయగలిగాము అని తెలిపారు. వినయకుమారికి చేసిన సర్జరీ ఇపుడు హాట్ టాపిక్ అయింది. అంతా ఆమెకు జరిగిన సర్జరీని 'బాహుబలి బ్రెయిన్ సర్జరీ' గా పేర్కొంటున్నారు.

# ఎన్టీపీసీలో దక్షిణ ప్రాంత ప్రాజెక్టుల నిర్వహణ సదస్సు




రామగుండం: స్థానిక ఎన్టీపీసీలో ప్రాజెక్టుల నిర్వహణ సాధన సదస్సును నిర్వహించారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని ఉద్యోగ వికాస కేంద్రంలో బిజినెస్ ఎక్స్‌లెన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సును ఎన్టీపీసీ జీఎం రవీంద్ర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పని చేస్తున్న ప్రదేశంలో తీసుకుంటున్న పొదుపు చర్యలతో సంస్థకు లాభాలు తెచ్చిపెట్టవచ్చన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఉత్పత్తికి దోహదపడాలని పేర్కొన్నారు. ఆపరేషన్, సీఅండ్ఐ, మెయింటేనెన్స్ తదితర విభాగాలకు చెందిన 12 బృందాలు తమ నిర్వహణ సాధన ప్రదర్శనలను పవర్‌పాయింట్ ద్వారా ప్రదర్శించాయి. ఉత్తమ ప్రదర్శనలకు జీఎం ఎంఎన్.ప్రసాద్ బహుమతులు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా ఆనంద్‌కలత్‌కర్, వె%.కె.ప్రసాద్ వ్యవహరించారు. దక్షిణ ప్రాంతం నుంచి సింహాద్రి, కాయంకుళం, వల్లూరు, చెన్నయ్, ఎస్ఆర్‌హెచ్‌క్యూ, రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టుల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య వైద్యాధికారి సశ్మితాడ్యాష్, బీఈ అధికారులు కామేశ్వర్‌రావు, ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.

***లక్ష్యానికి దూరంగా అర్ధవార్షిక విద్యుదుత్పత్తి***

రామగుండం ఎన్టీపీసీ విద్యుత్తు పరిశ్రమ అర్ధవార్షిక విద్యుత్తు ఉత్పత్తిని అందుకోలేకపోయింది. గడిచిన ఆరు నెలల్లో నిర్దేశిత 9823 మిలియన్ యూనిట్ల లక్ష్యానికి గాను 9368.684 మిలియన్ యూనిట్లను 82.04 శాతం పీఎల్ఎఫ్(ప్లాంట్‌లోడ్ ఫ్యాక్టర్)తో సాధించగలిగింది. కాగా గడిచిన సెప్టెంబరు మాసంలో 1574 మిలియన్ యూనిట్ల లక్ష్యానికి గాను 84.13 శాతం పీఎల్ఎఫ్‌తో 1574.862 మిలియన్ యూనిట్లను మాత్రం చేయగలిగింది. కాగా 2017-18 ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న 19638 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యానికి రాబోయే ఆరు నెలల్లో 10,269.316 మిలియన్ యూనిట్లు సాధించాల్సి ఉంది.

## అందుకే మేము నంబర్‌వన్ : ధావన్



ముంబయి: జట్టులో సీనియర్లు, జూనియర్లు ఎంతో ఆత్మవిశ్వాసంతో రాణిస్తుండటంతో భారత క్రికెట్ జట్టు టెస్టు, వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుందని ఓపెనర్ శిఖర్ ధావన్ తెలిపాడు. ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన ధావన్.. తన భార్య అనారోగ్యానికి గురికావడంతో బీసీసీఐ బోర్డు నుంచి అనుమతి తీసుకుని సిరీస్‌కు దూరమయ్యాడు. తాజాగా ఆసీస్‌తో టీ20 సిరీస్ కోసం బోర్డు ఎంపిక చేసిన జట్టులో ధావన్ స్థానం దక్కించుకున్నాడు.

తాజాగా ధావన్ ఓ అంతర్జాతీయ ఛానెల్‌తో మాట్లాడుతూ.. ప్రస్తుత జట్టులో ఉన్న ఆటగాళ్లు ఎంతో ప్రతిభావంతులు. యువ ఆటగాళ్లు సైతం ఆత్మవిశ్వాసంతో రాణిస్తున్నారు. ఐపీఎల్ ద్వారా డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లందరం అభిప్రాయాలను పంచుకోగలుగుతున్నాం. దీంతో మరింతగా మెరుగ్గా ఆడుతున్నాం. ఈ కారణాలతో టెస్టు, వన్డే ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లాం. అని ధావన్ వివరించాడు.

ప్రస్తుత భారత్ బెంచ్ కూడా చాలా బలంగా ఉంది. దీంతో ఆటగాళ్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మెరుగైన ప్రదర్శనతోనే జట్టులో స్థానం దక్కుతుందని ప్రతి ఒక్క ఆటగాడికీ తెలుసు. అందుకే ఎవరికి వారు తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరస్తున్నారు.

## ఆ ప్రపంచకప్‌కు ప్రచారకర్తగా అండర్సన్



దుబాయ్: వచ్చే ఏడాది జరగబోయే అండర్-19 ప్రపంచకప్‌కు అంబాసిడర్‌గా న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ కోరీ అండర్సన్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) ఎంపిక చేసింది. ఈ టోర్నీ జనవరి 13 నుంచి ఫిబ్రవరి 3 వరకు న్యూజిలాండ్‌లో జరగనుంది.

ప్రతిష్ఠాత్మక అండర్-19 ప్రపంచకప్ టోర్నీకి అంబాసిడర్‌గా ఎంపిక చేయడంపై అండర్సన్ హర్షం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్-19 ప్రపంచకప్‌లో మరోసారి భాగస్వామి కావటం ఎంతో ఆనందంగా ఉంది. 2008, 2010లో అండర్-19 ప్రపంచకప్‌లో ఆడాను.

## రైల్వేలో 10 లక్షల ఉద్యోగాలు

న్యూఢిల్లీ : రైల్వే వ్యవస్థలో భారీగా ఉద్యోగాలు వెల్లువెత్తనున్నాయి. ఏడాదిలోనే 10 లక్షల ఉద్యోగాలను రైల్వే ఎకోసిస్టమ్ సృష్టించగలదని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. రైల్వేలో ప్రత్యక్షంగా ఉద్యోగాలు అందకపోయినప్పటికీ, ఈ వ్యవస్థలో వివిధ ఏరియాల్లో పనిచేసే వారికి 12 నెలల కాలంలోనే మిలియన్ కొద్ది ఉద్యోగాలు లభిస్తాయని ఆయన అన్నారు. కేవలం రైల్వేలు, దాని వ్యవస్థ మాత్రమే ఇన్ని ఉద్యోగాలను సృష్టించనుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్, ఇండియా ఎకనామిక్ సమిట్ వద్ద గోయల్ చెప్పారు. రైలు ట్రాక్, భద్రత పరిరక్షణ ప్రొగ్రామ్‌లోనే 2 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందన్నారు. ఇటీవల జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా రైల్వే భద్రతపై ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఒకవేళ పైప్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే, ప్రస్తుతమున్న ప్రాజెక్టుల్లోనే 2 లక్షల నుంచి 2.5 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు. భారీ పెట్టుబడి సామర్థ్యాన్ని భారత్ కలిగి ఉందని, కానీ దేశం రూపాంతరం చెందడానికి ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. పెట్టుబడి పెట్టడానికి ప్రపంచంలో ఏ దేశం కూడా మంచిగా లేదని, భారత్ కంటే ఏది పెద్దది కాదని చెప్పారు.

## నేను సీఎంను.. ఉగ్రవాదిని కాదు : కేజ్రీవాల్



దిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్ మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. అసెంబ్లీ సమావేశాల్లో ఆప్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓ బిల్లును లెఫ్టినెంట్ గవర్నర్ బైజల్ వ్యతిరేకించారు. దీంతో సీఎం ఆయనపై మండిపడ్డారు. తానేమీ ఉగ్రవాదిని కాదని.. ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రినని కేజ్రీవాల్ అన్నారు.

పలు అంశాలపై చర్చిచేందుకు దిల్లీ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. ఇందులో 15వేల కాంట్రాక్టు టీచర్ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసేందుకు అధికార పార్టీ బిల్లు ప్రవేశపెట్టింది. అయితే ఈ బిల్లును ప్రతిపక్ష భాజపా వ్యతిరేకించింది. అటు లెఫ్ట్‌నెంట్ గవర్నర్ కూడా ఈ విషయంలో మరోసారి ఆలోచించాలని, రెగ్యులరైజ్ చేయడం దిల్లీ అసెంబ్లీ చట్టం పరిధిలోకి రాదని అన్నారు. దీంతో సీఎం కేజ్రీవాల్ సభలోనే ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ బిల్లుకు సంబంధించిన ఫైళ్లను లెఫ్ట్‌నెంట్ గవర్నర్ ఒక్కసారి కూడా విద్యాశాఖ మంత్రి మనీశ్ సిసోడియాకు చూపించలేదు. మాకు చూపించకుండా ఉండేందుకు వాటిలో రాష్ట్ర రహస్యాలు ఏమున్నాయి? నేను ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని, ఉగ్రవాదిని కాదు. సిసోడియా కూడా ప్రజలు ఎన్నుకున్న విద్యాశాఖ మంత్రి, టెర్రరిస్టు కాదు. అని కేజ్రీవాల్ మండిపడ్డారు. దీంతో ఆప్ నేతలంతా బల్లలు చరుస్తూ సీఎంకు మద్దతు తెలిపారు. ఆ తర్వాత ఓటింగ్ ద్వారా బిల్లును ఆమోదించారు. దీంతో భాజపా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసింది.

## శ్రీకాకుళం జిల్లాలో ఘోరం

లావేరు: శ్రీకాకుళం జిల్లాలో ఘోరం జరిగింది. దుస్తులు ఉతకడానికి చెరువుకు వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందారు. ఈ సంఘటన జిల్లాలోని లావేరు మండలం గుర్రాలపాలెంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన పతివాడ నాగమ్మ(45) ఆమె కూతురు శిరీష(13)తో పాటు పక్కింటి బాలిక బండారి దుర్గ(16)తో కలిసి గ్రామ శివారులోని చెరువులో దుస్తులు ఉతకడానికి వెళ్లింది.

ఈ క్రమంలో చెరువులో దిగి ఆడుకుంటున్న శిరీష ప్రమాదవశాత్తు నీట మునిగిపోయింది. ఆమెను రక్షించే క్రమంలో తల్లి నాగమ్మతో పాటు దుర్గ కూడా నీట మునిగి మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రహానె.. ఓ సైనికుడు



దిల్లీ: భారత క్రికెటర్ రహానె.. ఓ సైనికుడులాంటి వాడని, ఎప్పుడైనా జట్టులోకి వచ్చి తన సేవలను దేశానికి అందించేందుకు సిద్ధమని అతని కోచ్ ప్రవీణ్ ఆమ్రే అన్నారు. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ కోసం బీసీసీఐ ఎంపిక చేసిన జట్టులో రహానెను కాదని రాహుల్‌ను ఎంపిక చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే.

ఈ నేపథ్యంలో రహానె వ్యక్తిగత కోచ్ ప్రవీణ్ మాట్లాడుతూ.. రహానె ఓ సైనికుడులాంటి వాడు. ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా దేశానికి సేవ చేసేందుకు ఎదురుచూస్తూ ఉంటాడు. ఆటగాడిగా అతను ఎంతో పరిణతి సాధించాడు. ఆసీస్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక కాలేదని తెలిసినప్పుడు అతను స్పందించిన తీరే అందుకు నిదర్శనం. జట్టులో స్థానంపై అతడికి ఎలాంటి అభద్రతా భావం లేదు. ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రహానె వరుసగా 5, 55, 70, 53, 61 స్కోర్లతో రాణించాడు. సహజంగా ఇంత మంచి ప్రదర్శన చేసిన ఆటగాడు.. తదుపరి సిరీస్‌కు తనను ఎంపిక చేయకపోతే అది సెలక్టర్ల తప్పిదం అని చెప్పేవాడు.

కానీ, రహానె మాత్రం ప్రస్తుతం న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్ కోసం సాధనలో మునిగిపోయాడు అని ప్రవీణ్ తెలిపాడు.

## సర్కస్ మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఐకాస బాధ్యులు

- విద్యా సంస్థల బంద్‌కు పిలుపు
- ప్రైవేటు విద్యా సంస్థల పరిరక్షణకు సభ

హైదరాబాద్ : తెలంగాణలోని ప్రైవేటు విద్యా సంస్థలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ఆత్మగౌరవ సభ నేపథ్యంలో జిల్లాలో విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.నరేందర్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఆమోదిత పాఠశాల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్ రావు పేర్కొన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే మైదానం (సర్కస్ గ్రౌండ్)లో ఆత్మగౌరవ సభ ఏర్పాట్లను ఐకాస ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ప్రైవేటు విద్యా సంస్థల పరిరక్షణకు సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు స్వచ్ఛందంగా తరలివచ్చి సమస్యలను నివేదించాలన్నారు. కార్యక్రమంలో టీపీజేఎంఏ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జె.ప్రభాకర్‌గౌడ్, ప్రతినిధులు శ్రీధర్ రాజు, వెంకట్, ట్రస్మా బాధ్యులు అనంతరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, సొగాని కొమురయ్య, సీహెచ్ శ్రీనివాస్, రామకృష్ణ, చెన్నప్ప, టీపీడీఎంఏ జిల్లా అధ్యక్షుడు పి.వేణు తదితరులు పాల్గొన్నారు.




## అపహరణకు గురైన పాప క్షేమం

### కిడ్నాప్‌నకు పాల్పడిన ఇద్దరికి రిమాండ్



శంషాబాద్ : సంచలనం సృష్టించిన పసిపాప షైనీ(నాలుగు మాసాలు) అపహరణ కేసును ఆర్జీఐఏ పోలీసులు ఛేదించారు. ఆర్జీఐఏ ఠాణాలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంషాబాద్ జోన్ డీసీపీ పద్మజారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం...

మహేశ్వరం మండలం, నాగారం, పెద్దమ్మతండాకు చెందిన మోహన్, జ్యోతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. చిన్న కుమార్తె షైనీని పది రోజుల వయసు ఉన్నపుడే శంషాబాద్‌కు చెందిన ఎలిజబెత్ రాణికి అనధికారికంగా దత్తత ఇచ్చారు. శంషాబాద్, కాపుగడ్డకు చెందిన హంస అలియాస్ హంసమ్మ, అలియాస్ ఉమ, అలియాస్ అనూషకు నందిగామకు చెందిన అంజయ్యతో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హంస చెడు అలవాట్లకు బానిసై కొంతకాలంగా జులాయిగా తిరుగుతోంది.

రాజేంద్రనగర్, బుద్వేల్‌కు చెందిన చంద్రకాంత్ అనే క్యాబ్ డ్రె%వర్‌తో సహజీవనం చేస్తోంది. చిన్నారులను కిడ్నాప్ చేసి పిల్లలు లేని వారికి విక్రయిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని ఇద్దరూ పథకం పన్నారు. ఈ క్రమంలో ఎలిజబెత్ రాణి పెంచుకొంటున్న షైనీకి దుస్తులు ఇప్పిస్తానంటూ సెప్టెంబరు 29న తీసుకెళ్లి ఉడాయించారు. సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసిన హంస, చంద్రకాంత్ బుద్వేల్‌కు వెళ్లారు. ఎలిజబెత్ రాణి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు మొబైల్ సిగ్నల్ ట్రాక్ చేసి నిందితులిద్దరినీ పట్టుకున్నారు. విచారణలో మొదటి భర్త ఇంట్లో హంస దొంగతనానికి పాల్పడినట్లు వెలుగుచూసింది. 9 తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. చిన్నారి షైనీని జన్మనిచ్చిన తల్లిదండ్రులకు అప్పగించారు.



Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com